ఈనాటి

# తెలుగోడు

PRGI-NO-APTEL/25/A2739

EENAATI TELUGODU... Telugu Daily

https://www.eenaatitelugodu.com

Ph:8368102842
నాశా క్లినిక్
డా.భానుప్రకాష్ MBBS
సంప్రదించు వేళలు: ఉ.7.30 నుంచి 8.30 వరకు
సా.4 గం.నుంచి రాత్రి.8.30 వరకు
డా.నిహారిక BHMS
సంప్రదించు వేళలు:
ఉ.9 గం. నుంచి సా.5 గం. వరకు
Ph:9704461510
మా మెడికల్స్
ఎమ్మార్వో ఆఫీస్ ఎదురుగా ఓ.డి.చెరువు

సంపుటి-1 | సంచిక - 109 | ఆదివారం 18 జనవరి, 2026 | పేజీలు -6 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati

## బెంగాల్ అభివృద్ధికి మమత అడ్డు



**తృణమూల్‌ను సాగనంపే సమయం వచ్చింది..**

**చొరబాటుదారులకు తృణమూల్ అండతో నష్టం..**


**అవినీతి కారణంగా ప్రజలకు చేరని పథకాలు..**

**బీహార్ తరవాత ఇప్పుడు బెంగాల్ వంతు ..**

**మాల్దా సభలో తృణమూల్‌ను ఏకిపారేసిన ప్రధాని మోడీ..**

**కోల్‌కతా (తెలుగోడు), జనవరి 17 :**

బెంగాల్ ప్రజల పట్ల ఏమాత్రం కనికరం లేని అధికార తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం వచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇక్కడి చొరబాట్లకు తృణమూల్ అండగా నిలవడం పెద్ద సమస్యగా మారిందన్నారు. బీజేపీ అభివృద్ధి మోడల్‌ను జెన్‌జీ తరం విశ్వసిస్తోందని.. ఈసారి బెంగాల్ ప్రజలు మార్పు కోరుతూ బీజేపీకి (మిగతా 2లో)



### రాష్ట్రానికే గేమ్ ఛేంజర్ కానున్న

# గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి

- గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్
- గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రత్యేక ప్రోత్సాహం
- గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌కు సీఎం శంకుస్థాపన..
- 2027 నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తుందన్న చంద్రబాబు..
- గ్రీన్ అమ్మోనియా ఓ మైలు రాయి అన్న పవన్ కళ్యాణ్..

**కాకినాడ (తెలుగోడు), జనవరి 17 :**

గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కాకినాడలో రూ.18వేల కోట్లతో ఏర్పాటు చేయనున్న ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 'గ్రీన్ అమ్మోనియా.. భవిష్యత్తులో పెను మార్పునకు నాంది. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి బాగా పెంచాలని ప్రధాని మోదీ కోరుతున్నారు. 2014లోనే మా ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీకి నాంది పలికింది. ఇప్పుడు గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాకు నాంది పలికాం అని అన్నారు. కాకినాడలో ఏర్పాటయ్యేది ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ. 2027 జూన్ నాటికి మొదటి దశ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ మన రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ కానుందని చంద్రబాబు అననారు. బొగ్గు వినియోగం వల్ల పర్యావరణం దెబ్బతింటోంది.కాలుష్యం వల్ల సముద్రంలోనూ పెను మార్పులు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు వెయ్యి కి.మీ సముద్ర తీరం ఉంది. 20 పోర్టులు ఏర్పాటు కానున్నాయి. ప్రపంచంలో ఎండ పుష్కలంగా ఉండేది మిగతా.. 2లో

# దావోస్ కు సీఎం



● ఆదివారం దావోస్‌కు బయలుదేరనున్న రాష్ట్ర బృందం ● పెట్టుబడులే లక్ష్యంగా సమావేశాలు ● సీఎం చంద్రబాబుతో పాటు, మంత్రి లోకేష్, పలువురు అధికారుల బృందం

**అమరావతి (తెలుగోడు), జనవరి 17 :**

వరల్డ్ ఎకనామిక్ ఫోరం దావోస్ సదస్సులో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఉన్నతాధికారులతో కూడిన బృందం ఆదివారం విదేశీ పర్యటనకు బయల్దేరనుంది. నాలుగు రోజుల పాటు దావోస్‌లో జరగనున్న ఈ కీలక పర్యటనలో, ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు ఆకర్షించడం లక్ష్యంగా సీఎం విస్తృత స్థాయిలో సమావేశాలు, చర్చల్లో పాల్గొననున్నారు. ఆదివారం రాత్రి 8.35 గంటలకు విజయవాడ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి వెళ్లనున్న సీఎం బృందం, అక్కడి నుంచి స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్‌కు ప్రయాణం చేయనుంది. 19వ తేదీ అర్ధరాత్రి 1.45 గంటలకు ఢిల్లీ నుంచి బయల్దేరి, ఉదయం జ్యూరిచ్ చేరుకుంటారు. అక్కడ హిల్టన్ హోటల్‌లో స్విట్జర్లాండ్‌లో భారత రాయబారి మృదుల్ కుమార్ ముఖ్యమంత్రితో మర్యాద పూర్వక భేటీ కానున్నారు. అనంతరం ఎరోస్ ఇన్నోవేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ కిషోర్ లుల్లా, సహ అధ్యక్షులు రిథిమా లుల్లా, స్వనీత్ సింగ్‌లతో సీఎం సమావేశం జరగనుంది.

**పర్యటన వివరాలు..**

జ్యూరిచ్‌లో భారత ఎంబసీ ఆధ్వర్యంలో నిర్వహించే తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. 20 దేశాల నుంచి వచ్చిన ఎన్ఆర్టీలతో జరిగే ఈ సమావేశంలో తెలుగు ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించనున్నారు. అనంతరం రోడ్డు మార్గాన జ్యూరిచ్ నుంచి దావోస్‌కు సీఎం ప్రయాణం చేస్తారు.

**మొదటి రోజు...**

దావోస్ పర్యటన తొలి రోజున యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రితో జరిగే బహుళ దేశాల సమావేశంలో సీఎం పాల్గొంటారు. టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, ఐటీ (మిగతా 2లో)

## ఇరాన్‌లో అస్థిత్వం

**భారత్ హెచ్చరికతో స్వదేశానికి పౌరులు**
**రెండు విమానాల్లో పలువురి రాక**



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 17 :**

ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. నిరసనల కారణంగా ఇప్పటివరకు సుమారు రెండు వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌లోని భారతీయులు జాగ్రత్తగా ఉండాలని, వీలైనంత త్వరగా ఇండియాకు వచ్చేయాలని సూచించింది. శుక్రవారం రాత్రి రెండు కమర్షియల్ విమానాలు భారతీయులతో ఢిల్లీ చేరుకున్నాయి. అయితే.. అవి రెండూ రెగ్యులర్ విమానాలే. భారతీయులను ఇరాన్ నుంచి ఇండియాకు (మిగతా 2లో)

## 1574 రకాల వంటకాలు



**గోదావరి జిల్లాల్లో కొత్తల్లుల్లకు సంక్రాంతి విందులు..**

**ఆదుర్రు గ్రామంలో 1574 వంటకాలతో అల్లుడికి బాహుబలి విందు..**

**గోదారోళ్ల మమకారానికి నిలువెత్తు నిదర్శనం..**

**రాజమండ్రి (తెలుగోడు), జనవరి 17**

సంక్రాంతి అంటేనే తెలుగు వారికి అత్యంత ఇష్టమైన పండుగ. పెద్ద పండుగగా చెప్పుకునే సంక్రాంతి పండుగ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చాలా ఘనంగా నిర్వహిస్తారు. అటువంటి సంక్రాంతి పండుగకు ఏపీలో అల్లుళ్లను చాలా స్పెషల్ గా ట్రీట్ చేస్తారు. ముఖ్యంగా గోదావరి జిల్లాలలో అల్లుళ్లకు చేసే అతిథి మర్యాదలు ప్రతి ఒక్కరు కచ్చితంగా చెప్పుకుంటారు. గోదావరి జిల్లాలలో పెళ్లయిన తర్వాత కొత్తగా పెళ్లయిన కుమార్తె మొదటిసారి సంక్రాంతి పండుగకు తల్లిదండ్రుల ఇంటికి వస్తే అల్లుడికి ఇచ్చే విందు వార్తల్లో నిలుస్తుంది. వందల రకాల వంటకాలతో అల్లుడికి ఆతిథ్యం ఇచ్చి అన్ని వంటలను కొద్దికొద్దిగా రుచి చూపిస్తారు. అయితే తాజాగా పశ్చిమగోదావరి జిల్లాలో ఓ కుటుంబం సరికొత్త రికార్డును సృష్టించింది. అల్లుడికి ఏకంగా 1574రకాల (మిగతా 2లో)

## పట్టాలెక్కిన వందేభారత్ స్లీపర్

**● మాల్దాలో జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని**




**కోల్‌కతా (తెలుగోడు), జనవరి 17 :**

భారత్‌లో తొలి వందేభారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో జరిగిన కార్యక్రమంలో ఈ అధునాతన రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు స్లీపర్ రైల్లో ప్రయాణించే విద్యార్థులతో మోదీ ముచ్చటించారు. రైలు లోపలికి వెళ్లి అందులోని సౌకర్యాలను ప్రధాని పరిశీలించారు. పశ్చిమ బెంగాల్‌లోని హౌవ్‌డా- నుంచి అస్సాంలోని గువాహటి (కామాఖ్య) మధ్య ఈ రైలు రాకపోకలు సాగించనుంది. వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగాన్ని సాధించగలిగింది. రైల్వే భద్రత కమిషనర్ (సీఆర్ఎస్) సమక్షంలో కోటా (మిగతా 2లో)

## బడ్జెట్‌పై ఉత్కంఠత

**ఆదాయపు పన్ను స్లాబ్‌లలో మార్పులపై**
**వేతన జీవుల్లో పెరుగుతున్న ఉత్కంఠత**



**న్యూ ఢిల్లీ (తెలుగోడు), జనవరి 17 :**

పార్లమెంట్ లో ప్రవేశపెట్టే వార్షిక బడ్జెట్ పై ఇప్పటికే ఆర్థికమంత్రిత్వశాఖ కసరత్తు చేస్తోంది. ఇందులో ఈసారి కూడా ఆదాయపన్ను విషయంలో వేతన జీవులతో పాటు ఇతర వర్గాలు కూడా కేంద్రం వైపు ఆశగా ఎదురుచూస్తున్నాయి. ఈసారి ఆదాయపు పన్ను స్లాబ్ లలో ఉండబోయే మార్పులేంటి ?, ఇతర మార్పులేంటి, వీటి వల్ల తమకు ఏమైనా ప్రయోజనం ఉంటుందా లేదా అని వారు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.వాస్తవానికి గతేడాది కేంద్ర బడ్జెట్ లో ఆదాయపు పన్నుకు సంబంధించి పలు కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. పన్ను చెల్లింపుకు కనీస ఆదాయంగా ఉన్న 7 లక్షల స్లాబ్ ను కాస్తా ఏకంగా 12 లక్షలకు పెంచేశారు. అలాగే స్లాబ్ లలోనూ పలు మార్పులు చేశారు. రిబేట్ లోనూ మార్పులు చోటు చేసుకున్నాయి. మొత్తంగా పాత పన్ను విధానం కొనసాగిస్తూనే కొత్త పన్ను విధానం వైపు పన్ను చెల్లింపుదారుల్ని మళ్లించేందుకు ఏం చేయాలో నిర్మలా సీతారామన్ అంతా చేశారు.ఆ తర్వాత ఆదాయపు పన్ను (మిగతా 2లో)

## లోకేషన్నా.. మాటిచ్చారు

**లోకేష్ సార్.. జాబ్ క్యాలెండర్ ఏదీ..?**

**20లక్షల ఉద్యోగాలిస్తామన్నారు..**

**ఇచ్చిన మాట నిలుపుకోండి సార్..**

**ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్యం అవుతున్నాయి.**

**సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తున్న నిరుద్యోగులు..**



**అమరావతి (తెలుగోడు), జనవరి 17 :**

కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తుందని రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మంత్రి లోకేష్ జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని వెల్లడించారు. ఇది నిరుద్యోగులకు చాలా సంతోషాన్ని కలిగించింది. అయితే జనవరి నెల వచ్చి 17 రోజులు గడుస్తున్నా జాబ్ క్యాలెండర్ విషయంలో అతీగతీ లేకపోవడంతో నిరుద్యోగ యువత సోషల్ మీడియా వేదికగా లోకేష్ ను టార్గెట్ చేస్తున్నారు. రాజమండ్రిలో హలో లోకేష్ కార్యక్రమంలో భాగంగా జాబ్ క్యాలెండర్ పైన కీలక ప్రకటన చేసిన లోకేష్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరుతూ సోషల్ మీడియా వేదికగా మంత్రి లోకేష్ పై ఒత్తిడిని పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఏపీలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో జాబ్ క్యాలెండర్ ఎప్పుడు విడుదల చేస్తారని సోషల్ మీడియా ద్వారా లోకేష్ ను కోరుతున్నారు. ముఖ్యంగా ట్విట్టర్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వంటి (మిగతా 2లో)

## దూకుడు పెంచిన దుద్దుకుంట



**కష్టమొచ్చిన వైసీపీ శ్రేణులకు అభయం...**

**తన హయాంలో జరిగిన అభివృద్ధి పదేపదే ప్రజల్లోకి..**

**అధికార పక్ష వైఖరిపై ఎప్పటికప్పుడు విమర్శలు..**

**కార్యకర్తలు, నాయకుల్లో ఉత్సాహం పెంచే చర్యలు..**

**స్థానిక సమరానికి కార్యాచరణ దిశగా అడుగు..**

**మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట సరికొత్త ప్రణాళికలు..**

**పుట్టపర్తి (తెలుగోడు), జనవరి 17 :**

పుట్టపర్తి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తన దూకుడుని ప్రదర్శిస్తున్నారు. కష్టం వచ్చిన వైసీపీ శ్రేణుల ఇంటికి వెళ్లి నేనున్నానంటూ అభయమిస్తూ వారిలో ఒక భరోసా కల్పిస్తున్నారు. అదేవిధంగా తన హయాంలో జరిగిన ప్రతి అభివృద్ధి పనిని పదేపదే ప్రజలకు గుర్తుకు చేస్తూ ముందుకెళ్తున్నారు. ఈనేపథ్యంలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనుల విషయంలో ఆ రోడ్డు గుత్తేదారు కంపెనీకి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు దక్కింది. దీంతో ప్రస్తుత అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యే, మాజీ మంత్రి తదితరులు కలిసి సభను ఏర్పాటు చేసి గుత్తేదారు కంపెనీని ప్రశంసించారు. అదేవిధంగా తమ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పరుగులు తీస్తోందని వారు చెప్పిన మాటలను తిప్పి కొడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే పైనే నియోజకవర్గ వ్యాప్తంగా వున్న వైసీపీ శ్రేణులతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. గ్రీన్ ఫీల్డ్ హైవే పుట్టపర్తి నియోజకవర్గం గుండా వెళ్లేందుకు తాను చేసిన ప్రయత్నం, తమ నాయకుడు జగన్ చొరవను సాక్ష్యాధారాలతో ప్రదర్శించి తమ హయాంలో ప్రారంభమైన పనిగా సులువుగా ప్రజలకు అర్థమయ్యే విధంగా తన వాక్చాతుర్యాన్ని ప్రదర్శించారు దుద్దుకుంట..(మిగతా 2లో)

# గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి



(మొదటి పేజి (తరువాయి)

మనదేశంలోనే. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ .. మన రాష్ట్రానికి వరం అని అన్నారు. మన సంస్కృతిని కాపాడుకుంటూనే టెక్నాలజీని వాడుకోవాలి. ఎంత ఎత్తుకు ఎదిగినా స్వగ్రామాన్ని మర్చిపోకూడదు. ఆలోచనలు ఆచరణలో పెట్టేవారు చాలా కొద్ది మందే ఉంటారు. వారిలో చలమలశెట్టి అనిల్ ఒకరు. చరిత్రను తిరగరాయడంలో తెలుగువాడు ముందున్నందుకు గర్వంగా ఉంది. ఆనాడు ఎన్టీఆర్ చొరవతో కాకినాడకు నాగార్జున ఫెర్టిలైజర్స్ కంపెనీ వచ్చింది. కాకినాడ గురించి భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా చర్చించుకుంటారు. ఇలాంటి పరిశ్రమలకు అనుకూలమైన పరిస్థితులన్నీ ఇక్కడ ఉన్నాయి. ప్రజలకు మేలు జరిగే ఆలోచనలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేస్తోంది. 2047 నాటికి మన రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తయారవుతుందని అన్నారు. గ్రీన్ అమ్మోనియా వల్ల వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని అన్నారు. ప్రకృతి సేద్యం పెరగడమే అందరి ఆరోగ్యాలకు శ్రీరామ రక్ష. ఎరువులు, పురుగుమందుల వినియోగం బాగా తగ్గించాలి. గ్రీన్ అమ్మోనియాను ఏ దేశానికైనా ఎగుమతి చేసే అవకాశం ఉందని సీఎం అన్నారు. బలమైన సంకల్పం ఉంటేనే ఏదైనా సాధించగలమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. తాను పుట్టి పెరిగిన కాకినాడకి అనిల్ ఎంతో చేస్తున్నారని అభినందించారు. అనేక కష్టాలను తట్టుకుని ఏఎమ్ గ్రీన్ కంపెనీ పెట్టారు. పర్యావరణాన్ని పరిరక్షించు కుంటూ ముందుకెళ్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్ దిశగా మనం వేసే అడుగులు చాలా కీలకం. క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం అన వివరించారు. కాలుష్య రహిత ఇంధన ప్రయాణంలో ఇదో మైలురాయి. రాష్ట్ర సుస్థిరాభివృద్ధిలో ఇది గేమ్ ఛేంజర్ కానుంది. ఈ ప్రాజెక్టు వల్ల వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతారని అన్నారు. గత ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తల ఇబ్బందులు తెలుసు. పార్టీలు మారవచ్చు.. కానీ, ప్రభుత్వ వ్యవస్థ శాశ్వతం అని పవన్ అన్నారు.

# దావోస్‌కు సీఎం

(మొదటి పేజి (తరువాయి)


శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ముఖ్యమంత్రితో భేటీ కానున్నారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీతోనూ సమావేశం జరగనుంది. ఈ రోజే అంతర్జాతీయ మీడియా సంస్థ 'పొలిటికో'కు సీఎం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు.

**రెండో రోజు ...**రెండో రోజు పర్యటనలో 'ఇండియా ఎట్ సెంటర్ - జియోగ్రఫీ గ్రోత్, ఏపీ అడ్వాంటేజ్' అంశంపై సీఐఐ నిర్వహిస్తున్న బ్రేక్‌ఫాస్ట్ సమావేశంలో సీఎం పాల్గొంటారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇండియా లాంజ్ ప్రారంభోత్సవానికి హాజరవుతారు. ఐబీఎం చైర్మన్, సీఈఓ అరవింద్ కృష్ణ, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్‌లతో సీఎం కీలక సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ భేటీలకు ఐటీ మంత్రి నారా లోకేష్ కూడా హాజరవుతారు.అదే రోజు 'వన్ ఫ్యామిలీ - వన్ ఎంటర్‌ప్రెన్యూర్' ప్యానల్ డిస్కషన్‌లో పాల్గొన్న అనంతరం సీఎన్‌బీసీ ఇంటర్నేషనల్‌కు సీఎం ప్రత్యేక ఇంటర్వ్యూ ఇవ్వనున్నారు. వరల్డ్ ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, ఎన్విడియా ఉపాధ్యక్షుడు కాలిస్టా రెడ్మండ్, మోలర్ మేర్స్క్ సీఈఓ విన్సెంట్ క్లెర్క్ వంటి ప్రముఖులతోనూ సీఎం ముఖాముఖి భేటీలు జరగనున్నాయి.

**మూడో రోజు..**

మూడో రోజు పర్యటనలో పారిశ్రామిక అభివృద్ధి, ఇన్నోవేషన్, ఎనర్జీ ట్రాన్సిషన్, వాతావరణ మార్పులు, ఏఐ ఆధారిత గ్లోబల్ ఎకానమీ వంటి అంశాలపై జరిగే పలు సెషన్లలో సీఎం పాల్గొంటారు. బ్లూమ్‌బర్గ్ నిర్వహించే 'ఏఐ మూమెంట్ - ట్రాన్స్‌ఫార్మింగ్ గ్లోబల్ ఎకానమీ' సెషన్‌లో ముఖ్య వక్తగా ప్రసంగించనున్నారు. ఏపీ లాంజ్‌లో నిర్వహించే మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమంలో కేంద్ర మంత్రులతో కలిసి పాల్గొంటారు. మొత్తంగా దావోస్ పర్యటనలో సీఎం చంద్రబాబు 36 కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ప్రభుత్వాల మధ్య 3 కీలక సమావేశాలు, పారిశ్రామికవేత్తలతో 16 వన్-టు-వన్ భేటీలు, 9 రౌండ్ టేబుల్ చర్చలు జరగనున్నాయి. వివిధ అంతర్జాతీయ మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు కూడా ఇవ్వనున్నారు. జనవరి 22న దావోస్ నుంచి జ్యూరిచ్ చేరుకున్న సీఎం, అదే రోజు స్విట్జర్లాండ్ కాలమానం ప్రకారం మధ్యాహ్నం 2.35 గంటలకు భారత్‌కు బయల్దేరనున్నారు. 23వ తేదీ ఉదయం 8.25 గంటలకు హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

# దూకుడు పెంచిన దుద్దుకుంట



(మొదటి పేజి (తరువాయి)

కూటమి పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు ఎక్కడో వుంటాడు, అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంటాడని దుద్దుకుంటపై చేస్తున్న విమర్శలను కూడా సునాయాసంగా తిప్పికొడుతూ కూటమి ప్రభుత్వ వైఖరిపై విమర్శలు గుప్పించడంలోనూ రాణిస్తూ వైసీపీ శ్రేణుల్లో మెప్పు పొందుతున్నారు. ఆయన అధికారంలో వున్నప్పటికి, ప్రస్తుతం మాట్లాడే తీరుపై ఎంతో తేడాను కనబరుస్తూ ఓ సామాన్యుడిలా వ్యవహరిస్తూ తన వాక్చాతుర్యంతో సమావేశాలు, సభల్లో ఆకట్టుకుంటూ ప్రశంసలు పొందుతుండటం విశేషం. మరీ ముఖ్యంగా తమ పార్టీ అధికారంలో లేదు కదా అనే నైరాశ్యంతో వున్న పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతూ స్థానిక సమరానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. మరీ ముఖ్యంగా నియోజకవర్గ వ్యాప్తంగా అత్యధిక స్థానాల్లో స్థానిక సంస్థల్లో గెలుపును కైవసం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. తాము అధికారంలో వున్నప్పటి అనుభవాలను నెమరేసుకుంటూ ఎలా వ్యవహరించాల్లో సరికొత్త ప్రణాళికలతో దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. తన దినచర్యలో భాగంగా నియోజవర్గంలో పర్యటనలను ఉదయం ప్రారంభించి పగలంతా వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో గడుపుతూ ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలపై చర్చిస్తూ వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమని నిరుత్సాహంతో వున్న వైసీపీ శ్రేణుల్లో ఓ భరోసా నింపుతూ ఓ సామాన్యుడిలా దూసుకెళ్తుండటం చూస్తే వచ్చే ఎన్నికల్లో తమ అభ్యర్థి గెలవడం ఖాయమనే నమ్మకం కలుగుతోందని నియోజకవర్గంలోని పలువురు వైసీపీ సీనియర్ నాయకులు వారి అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు..



# బెంగాల్ అభివృద్ధికి మమత అడ్డు




(మొదటి పేజి (తరువాయి)

పట్టం కడతారనే నమ్మకం తనకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. బృహన్ ముంబై ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం అనంతరం తొలిసారి పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో మోదీ పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రథమార్థంలో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. రాష్ట్రంలో అవినీతి కారణంగా కేంద్ర పథకాల ప్రయోజనాలు.. పేద ప్రజలకు చేరడం లేదని ప్రధాని ఆరోపించారు. బెంగాల్‌లోని పేదలందరికీ సొంత ఇళ్లు, ఉచిత రేషన్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలన్నదే తన కోరిక అని అన్నారు. పేద ప్రజల కోసం పంపిన సొమ్ములను టీఎంసీ నేతలు లూటీ చేస్తున్నారన్నారు. 'టీఎంసీ ప్రభుత్వం నాకు, బెంగాల్ ప్రజలకు శత్రువుగా మారుతోంది' అని తీవ్రంగా ఆక్షేపించారు మోదీ. బెంగాల్ విజన్‌తోనే 2047 నాటికి అభివృద్ధి భారత్ విజన్ సాకారమవుతుందని ప్రధాని అన్నారు. ఒడిశా, త్రిపుర, అస్సాం, బిహార్‌లో బీజేపీ వరుస విజయాలను ప్రస్తావిస్తూ, ఇప్పుడు బెంగాల్‌లో సుపరిపాలనకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. మహారాష్ట్రలో బీజేపీ ఇటీవల చారిత్రక విజయం సాధించిందని, ముఖ్యంగా ముంబై పురపోరు ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిందని గుర్తుచేశారు. 'ఈసారి బెంగాల్లో మార్పు అవసరముందని నేను చెబుతాను.. బీజేపీ సర్కార్ కావాలి' అని మీరు చెప్పండి.. అంటూ సభికులను మోదీ ఉత్సాహపరిచారు. కేంద్ర పథకాలను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని అడ్డుకోవడంపై విమర్శలు గుప్పిస్తూ.. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అడ్డుకున్న ఏకైక రాష్ట్రం బెంగాల్ అని, పేద ప్రజలకు ఎలాంటి పథకాలు అందనీయడం లేదని మోదీ చెప్పారు. ఇలాంటి క్రూర ప్రభుత్వానికి గుడ్‌బై చెప్పే సమయం వచ్చిందన్నారు. మాల్దాలో ఫ్యాక్టరీలు లేకపోవడంతో మాల్దా, ముర్షిదాబాద్ ప్రజలు ఉద్యోగాల కోసం వలసలు వెళ్తున్నారని, మామిడి రైతులు ప్రభుత్వ విధానాలు, వరదల సమయంలో చూపిస్తున్న నిర్లక్ష్యంతో ఎంతో నష్టపోతున్నారని అన్నారు. గంగా, ఫులాహార్ నదీ తీర కోత కారణంగా వేలాది మంది ఇళ్లు కోల్పోయారని, రక్షణ గోడ కోరుతూ ప్రజలు చేస్తున్న ఆర్తనాదాలను టీఎంసీ సర్కార్ ఖాతారు చేయడం లేదని విమర్శించారు. కేంద్రం పంపిన వరద సహాయక నిధులు లబ్దిదారులకు చేరలేదని కాగ్ నివేదకలు కూడా చెబుతున్నాయని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే టీఎంసీ అనుచిత విధానాలకు స్వస్తి చెప్పి, వరదల నివారణకు సమగ్ర పరిష్కారం కల్పిస్తామని, మామిడి సాగు చేసే మాల్దా రైతుల కోసం కోల్డ్ స్టోరేజీ సౌకర్యం కల్పించి ఆర్థికంగా బలపడేలా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలను తీర్చడంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం విఫలమైందని, బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రధాని మోదీ అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే భాజపా ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. బిహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక బెంగాల్‌కు సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా బెంగాల్‌కు అసలైన సవాల్ చొరబాట్లేనని, వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బెంగాల్‌కు అతిపెద్ద సవాల్ చొరబాట్లేనని.. వీటి కారణంగానే మాల్దా, ముర్షిదాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగుతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. చొరబాట్ల ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల జనాభా వర్గీకరణలోనూ మార్పు వచ్చిందని, వీటిని అరికట్టడానికి తృణమూల్ కాంగ్రెస్ ఎటువంటి చర్యలు చేపట్టలేదని దుయ్యబట్టారు. రాష్ట్రానికి వరద సహాయ నిధులను 40 సార్లు అందించామని, అయినా అవి అసలైన లబ్దిదారులకు చేరలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కేంద్రం నిధులను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లగొడుతోందని.. ఆ పార్టీ అవినీతి, హింస, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే పార్టీ అని అన్నారు. టీఎంసీ అధికారం కోల్పోయి.. భాజపా అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తూర్పు భారత్ దశాబ్దాలుగా వెనకబడి ఉందన్నారు.

# ఫేస్ రికగ్నేషన్ హాజరు తప్పనిసరి

## గ్రామస్థాయిలో ఉద్యోగుల అటెండెన్స్

**అమరావతి (తెలుగోడు), జనవరి 17 :**

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పని తీరును మరింత పర్యవేక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల అటెండెన్స్ కోసం ఫేస్ రికగ్నిషన్ ఆధారిత మొబైల్ యాప్‌ను తప్పనిసరి చేయాలని నిర్ణయించింది. ఇకపై ఈ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యాలయ సమయాలను ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆలస్యం, గైర్హాజరు లాంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకునే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు. ఇక, ప్రస్తుతం రీ-సర్వే కార్యక్రమాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు మాత్రం ఈ అటెండెన్స్ యాప్ నుంచి తాత్కాలిక మినహాయింపు ఇవ్వనున్నట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఫీల్డ్‌లో పని చేస్తున్న వారి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. కాగా, ఇటీవల కొంతమంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఆఫీసుల్లో అందుబాటులో ఉండటం లేదన్న ఫిర్యాదులు అధికారుల దృష్టికి వచ్చాయి. ప్రజలకు సక్రమంగా సేవలు అందడం లేదని, కార్యాలయాల్లో ఉద్యోగులు కనిపించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి అని సర్కార్ సీరియస్‌గా తీసుకుంది. కాగా, ప్రజలకు నేరుగా సేవలు అందించే గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఉద్యోగుల పని తీరును మెరుగుపరచడం, జవాబుదారీతనం పెంచడం లక్ష్యంగా ఈ ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ యాప్‌ను తీసుకొస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇక, ఈ కొత్త విధానం అమలుతో గ్రామ, వార్డు సచివాలయాల్లో సేవలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందనున్నాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# మారుతీ సుజుకీ భారీ పెట్టుబడి

## రూ.35 వేల కోట్లతో కొత్త కార్ల తయారీ పరిశ్రమ




**గాంధీనగర్ (తెలుగోడు), జనవరి 17 :**

ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ గుజరాత్‌లో మరో ప్లాంట్ ఏర్పాటు చేయబోతోంది. ఖోరజ్ వద్ద రూ.35 వేల కోట్ల వ్యయంతో కొత్త కార్ల తయారీ పరిశ్రమను నెలకొల్పనుంది. ఏటా 10 లక్షల కార్ల తయారీ లక్ష్యంగా ఏర్పాటువుతున్న ఈ ప్లాంట్ ద్వారా 12 వేలమందికి నేరుగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇందుకోసం గుజరాత్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 1750 ఎకరాలను మారుతీ సుజుకీకి కేటాయించింది.గాంధీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ ఎండీ హితాచీ తకేయూచీ పెట్టుబడుల ధ్రువీకరణ పత్రాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు అందజేశారు. భారత ఆటోమొబైల్ హబ్స్‌లో గుజరాత్ ఒకటిగా నిలిచిందని, ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని సీఎం 'ఎక్స్' వేదికగా హర్షం వ్యక్తం చేశారు. భారత్-జపాన్ భాగస్వామ్యాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం హర్ష్ సంఘ్వీ, మారుతీ సుజుకీ ప్రతినిధులు పాల్గొన్నారు. 1983లో మారుతీ సుజుకీ దేశీయంగా తన కార్యకలాపాలను ప్రారంభించింది. హరియాణాలోని గురుగ్రామ్‌లో తొలి ప్లాంట్‌ను నెలకొల్పింది. తర్వాత తన ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకుంటూ వచ్చింది. గుజరాత్‌లో ఇది వరకే ఒక ఎ÷-లాంట్ నెలకొల్పిన ఆ కంపెనీ.. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కార్ల తయారీని చేపట్టేందుకు కొత్త ఎ÷-లాంట్ ఏర్పాటుకు పూనుకుంది. ఏటా 40 లక్షల కార్ల తయారీని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం 17 మోడళ్లను 650 రకాల వేరియంట్లను మారుతీ దేశ, విదేశీ మార్కెట్లలో విక్రయిస్తోంది. 2025లో 22.55 లక్షల కార్లను మారుతీ ఉత్పత్తి చేసింది.

# వందేభారత్ స్లీపర్

(మొదటి పేజి (తరువాయి)

(రాజస్థాన్) నుంచి నాగ్దా (మధ్యప్రదేశ్) మధ్య తుది పరీక్షలు నిర్వహించగా రైలు ఈ వేగాన్ని చేరుకుంది. గాజు గ్లాసుల్లో నీళ్లు నింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజిన్‌లో ఉంచినా.. రైలు గరిష్ఠ వేగాన్ని చేరుకున్నప్పుడు కూడా ఏమాత్రం నీళ్లు తొణకకపోవడాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గతంలో సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ రైల్లో 16 కోచ్‌లు ఉన్నాయి. వీటిలో ఆకర్షణీయమైన (ఏసీ) స్లీపర్ బెర్తులు, అధునాతన సస్పెన్షన్ వ్యవస్థ, నిప్పును గుర్తించే వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి. విమానంలో ప్రయాణించిన అనుభూతిని కలిగించేలా ఇందులో సౌకర్యాలను ఏర్పాటుచేశారు. ఇందులో కనీస ఛార్జి రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. ఆర్ఏసీ, వెయిటింగ్ లిస్ట్ వంటి వాటిని ఇందులో అనుమతించరు.

# ఇరాన్‌లో అస్థిత్వం

(మొదటి పేజి (తరువాయి)

తరలించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన విమానాలు కాదు. ఇక.. భారత ప్రభుత్వం అక్కడి పరిస్థితులను బట్టి చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అత్యవసరమైతే తప్ప ఇరాన్‌కు ప్రయాణించవద్దని భారతీయులను హెచ్చరించింది. ఇరాన్ ఎయిర్ స్పేస్ తాత్కాలికంగా మూసివేయడంతో జనవరి 15 నుంచి రెండు దేశాల మధ్య పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇప్పుడిప్పుడే ఎయిర్ స్పేస్ పరిస్థితులు సాధారణ స్థితిలోకి వస్తున్నాయి. దీంతో భారతీయులు అక్కడి నుంచి ఇండియాకు వచ్చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం తమకు ఎంతో సాయం చేసిందని అంటున్నారు. శుక్రవారం రాత్రి ఇండియాకు చేరుకున్న ఓ ఎంబీబీఎస్ విద్యార్థిని మీడియాతో మాట్లాడుతూ.. 'నేను నిరసనల గురించి విన్నాను. కానీ, నేరుగా చూడలేదు. అక్కడ ఇంటర్‌నెట్ కూడా లేదు' అని చెప్పుకొచ్చారు. మరో వ్యక్తి స్పందిస్తూ.. 'మేము బయటకు వెళ్లినపుడు నిరసనకారులు కారుకు అడ్డంగా వచ్చారు. కొంచెం ఇబ్బంది పెట్టారు. అక్కడ ఇంటర్‌నెట్ కూడా లేదు. ఆ కారణంతో ఇండియాలోని మా కుటుంబాలకు విషయం చెప్పలేకపోయాం. ఆఖరికి ఇండియన్ ఎంబసీని కూడా సంప్రదించలేకపోయాం' అని వాపోయారు. ఓ ఇంజనీర్ మాట్లాడుతూ.. 'ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతున్నాయి. నెట్‌వర్క్ సమస్యలు ఉన్నాయి' అని అన్నారు.

# 1574 రకాల వంటకాలు

(మొదటి పేజి (తరువాయి)

వంటకాలతో విందును ఏర్పాటు చేస్తే ప్రతి ఒక్కరిని ఆశ్చర్యపోయేలా చేసింది. ఇక ఇంత భారీగా విందు ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదు అంటే నమ్మి తీరాల్సిందే. మామిడికుదురు మండలం ఆదుర్రు గ్రామానికి చెందిన విజ్జెపు వెంకటరత్నం, సుశీల దంపతుల కుమార్తె కీర్తి శ్రీ వివాహం గత సంవత్సరం ఫిబ్రవరి మాసంలో జరిగింది. పి.గన్నవరం మండలం ముంగండ గ్రామానికి చెందిన సాయిశరత్ తో ఆమె వివాహం ఘనంగా జరిగింది. పెళ్లయిన తర్వాత వారికి వచ్చిన మొదటి సంక్రాంతి కావడంతో, అల్లుడు సాయి శరత్ ను ఆశ్చర్య పరచాలని భావించిన అత్తమామలు ఆయన కోసం గ్రాండ్ గా విందును ఏర్పాటు చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా అల్లుడికి 1574 రకాల వంటకాలతో బాహుబలి స్థాయిలో విందును ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన స్వీట్లు, పిండివంటలు, పలు రకాల పండ్లు, కూల్ డ్రింక్స్ ఇలా అన్నీ కలిపి విందులో వడ్డించారు.వీరు మాత్రమే కాదు ఏలూరు జిల్లాలో కైకరం గ్రామంలో ఏకంగా ఒక వెయ్యి 116 రకాల పిండివంటలతో అల్లుడికి ఆతిథ్యం ఇచ్చారు. కొత్తగూడెం జిల్లా పాల్వంచలో 271 రకాల వంటకాలతో, మొగల్తూరు పంచాయతీ నల్లం వారి తోటలో ఒక అల్లుడికి 260 రకాల వంటకాలతో విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ అపూర్వమైన విందులో పసందైన వంటలను రుచి చూసిన అల్లుళ్లు మాత్రం వీళ్ళు భోజనం పెట్టి చంపేసేలా ఉన్నారని సరదాగా చమత్కరించారు. అత్తమామల ప్రేమకు ఫిదా అయ్యారు.

# లోకేషన్నా.. మాటిచ్చారు

(మొదటి పేజి (తరువాయి)

సామాజిక మాధ్యమాల్లో వంటి హ్యాష్‌ట్యాగ్‌లు ట్రెండ్ అవుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్యం కావడం వల్ల తమ భవిష్యత్ అగమ్యగోచరంగా మారుతోందని యువత ఆవేదన వ్యక్తం చేస్తోంది. మాటిచ్చినట్టే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నిరుద్యోగ యువత డిమాండ్ చేస్తున్నారు. ఈ పరిణామాలతో మంత్రి లోకేష్‌పై జాబ్ క్యాలెండర్ ప్రకటనతో ఒత్తిడి పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఈ నెలలో లోకేష్ జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోతే ప్రతిపక్షం సైతం ఆయనను టార్గెట్ చేసే అవకాశం ఉంది. ఇప్పటికే వైసిపి నాయకులు ప్రభుత్వ పని విధానంలో లోపాలను ఎత్తిచూపుతూ అనేక విధాలుగా టార్గెట్ చేస్తున్నారు. ప్రస్తుతం లోకేష్ మాట్లాడిన వ్యాఖ్యలను, జాబ్ క్యాలెండర్ ప్రకటనను వైరల్ చేస్తూ జాబ్ క్యాలెండర్ ఇస్తారా చస్తారా అంటూ టార్గెట్ చేస్తున్నారు.

# బడ్జెట్‌పై ఉత్కంఠత

(మొదటి పేజి (తరువాయి)

చట్టంలోనూ సవరణలు చేసి కొత్త చట్టాన్ని తీసుకొచ్చారు. దీంతో ఈసారి కేంద్ర బడ్జెట్ లో ఆదాయపు పన్ను చట్టం విషయంలో పెద్దగా మార్పులు, చేర్పులు ఉండకపోవచ్చని నిపుణులు చెప్తున్నారు. ఉన్నా పరిమితంగానే ఉంటాయని వారు భావిస్తున్నారు. డిమాండ్‌కు సంబంధించిన డేటాలో కనిపిస్తున్నట్లుగా జీఎస్టీ స్లాబ్ ల క్రమబద్ధీకరణ వినియోగదారుల నమ్మకాన్ని పునరుద్ధరించిందని నిపుణులు భావిస్తున్నారు.ప్రభుత్వం ఈ ఊపును కొనసాగించాలని, విధానపరమైన అవాంతరాలను నివారించాలని వారు కోరుతున్నారు.

# పల్నాడును వల్లకాడు చేసింది వైసీపీనే

**గుంటూరు (తెలుగోడు), జనవరి 17 :**

పల్నాడును వల్లకాడు చేసింది మీరు కాదా..వ్యక్తిగత కక్షలను పార్టీకి రుద్దుతారా అంటూ వైకాపా తీరుపై మండిపడ్డారు ఎమ్మెల్యే యరపతినేని. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైకాపా నేతలు శవరాజకీయాలు చేస్తున్నారని తెదేపా సీనియర్ నేత, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. అయిదేళ్ల జగన్ పాలనలో హత్యలు, అరాచకాలు చేసి పల్నాడును వల్లకాడు చేశారని పేర్కొన్నారు. గుంటూరులోని క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇద్దరు దళితుల మధ్య అనుకోకుండా జరిగిన ఘటనలో వైకాపా సానుభూతిపరుడు సాల్మన్ మృతి చెందితే దానికి రాజకీయ రంగు పులిమి కాసు మహేష్‌రెడ్డి శవరాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎప్పుడు ఎటువంటి ఘటనలు జరుగుతాయా..అని కాచుకు కూర్చున్న మహేష్‌రెడ్డి ఉనికి కోసం పస లేని, చచ్చు వాదన చేస్తున్నారు. పేద దళితుడు సాల్మన్‌ను చంపాల్సిన అవసరం ఏమి ఉంటుందని ప్రశ్నించారు. వైకాపా అధికారంలో ఉన్న అయిదేళ్లలో 12 మంది తెదేపా కార్యకర్తలను వెంటాడి, వేధించి హత్య చేశారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వారు ఉన్నారు.ఏడాదిన్నరగా గురజాలలో ఎటువంటి ఘర్షణలు లేవు. ప్రశాంతంగా ఉంది. ముమ్మరంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అక్రమ మైనింగ్ చేసిన గుంతల్లో పడి ఎనిమిది మంది పిల్లల ప్రాణాలు కోల్పోయారు. ఆ తల్లుల కడుపు కోత మీకు వినిపించడం లేదా..పిన్నెల్లిలో 100 మంది కాళ్లు, చేతులు విరగ్గొట్టారు. మానభంగాలు చేశారు. ఆస్తులు ధ్వంసం చేయడమే గాక ఊళ్లు విడిచి వెళ్లేలా చేసి 2000 ఎకరాలు బీడు పెట్టారు. కూలి డబ్బు ఇవ్వమన్నందుకు కత్తులతో పొడిచి పేగులు బయటకు లాగి నీలకంఠబాబును కిరాతకంగా హత్య చేశారు. నాకు కుడి భుజం వలే ఉండే అంకులు అనే వ్యక్తిని మట్టుబెట్టారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ప్రవర్తన మార్చుకొని అభివృద్ధికి సహకరించాలి. లేదంటే ఇలాంటి వారిని ఏం చేయాలో ప్రకృతి సమాధానం చెబుతుందని యరపతినేని వ్యాఖ్యానించారు.



జకనీ మాత ఉత్సవాల వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు

## సునామా జకనీ మాత ఉత్సవాల వాల్‌పోస్టర్లు విడుదల

**గుత్తి (తెలుగోడు), జనవరి 17 :**
గుత్తి పట్టణంలోని సునామి జకనీ మాత ఆలయ ప్రాంగణంలో ఈనెల 29, 30 తేదీలలో జరగనున్న జకనీ మాత అమ్మవారి ఉత్సవాల వాల్ పోస్టర్లను ఉత్సవ కమిటీ నిర్వాహకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరగనున్న ఉత్సవాలకు దేశవ్యాప్తంగా ఉన్న ఆరెకటికల కీలక నాయకులు కులస్తుల నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారన్నారు. ఈనెల 29వ తేదీ గుత్తి టౌన్ సాయిబాబా గుడి నుండి కళాశాలతో మహిళలు ఊరేగింపుగా వస్తారన్నారు. వివిధ రకాల వాయిద్యాలతో, వివిధ రకాల అలంకారణాలతో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సురేష్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏం. కే. సాయినాథ్, ఉపాధ్యక్షులు ఏం. కె. బాబు రావు, గౌరవ అధ్యక్షులు గుంతకల్ సాయిబాబా, రాయచుర్ అశోక్ కల్యాణకార్, సురేష్ మల్కారీ, అమర్నాథ్, శ్రీమతి భాగ్యబాయి, లక్ష్మీబాయి, పంకజ లక్ష్మి, గౌరీబాయి తదితరులు పాల్గొన్నారు.



## 19న అంకాలమ్మ కుంటెమ్మ జాతర

**పామిడి (తెలుగోడు), జనవరి 17 :**
పట్టణ శివారు ప్రాంతం కొండూరు రోడ్డులో వెలసిన అంకాలమ్మ కుంటెమ్మ 18వ జాతర ఈనెల 19న ప్రారంభమై మూడు రోజులపాటు జరుగుతుందని ఆలయ అర్చకులు నాగన్న తెలిపారు. సోమవారం అంకాలమ్మ కుంటెమ్మ అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేక పూజల అనంతరం గ్రామోత్సవం నిర్వహజస్తామన్నారు. మంగళవారం జాతర, పాలపళ్ల ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు, బ్రహ్మంగారి చరిత్ర పౌరణిక నాటక ప్రదర్శన ఉంటాయన్నారు. బుధవారం న్యూ కేటగిరి రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహిస్తారన్నారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్:9642578133 సంప్రదించాలని అర్చకులు నాగన్న వెల్లడించారు.

## శివ, అయ్యప్ప మాలధారణ స్వాములకు దుప్పట్లు పంపిణీ

**అనంతపురం రూరల్ (తెలుగోడు), జనవరి 17**
నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్పర్సన్ శ్రీమతి డాక్టర్. ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో శివ, అయ్యప్ప మాలధారణ స్వాములకు దుప్పట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు రమణ, శ్రీమతి అరుణ దంపతుల కుమార్తె వైష్ణవి పుట్టినరోజు సందర్భంగా తడకలేరు వద్ద ఉన్న అశ్వర్థ నారాయణ స్వామి దేవాలయంలో 25 మంది శివ, అయ్యప్ప స్వాములకు శనివారం దుప్పట్లు, టవళ్లతో పాటు వాటర్ బాటిల్ పళ్ళు దక్షిణ ఇచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ దేవుడి మాల ధరించి, దేవుడి సన్నిధిలో ఉంటూ చలికి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. దేవుడు మానవ రూపంలోనే సహాయం చేస్తాడన్న భావన అందరిలో రావాలన్నారు. ఆపదలోనూ అవసరంలోనూ ఉన్నవారికి సహాయం చేసిన వారే దేవుడు అవుతారన్న విషయాన్ని పురాణాలు తెలిపాయన్నారు. వీలున్న ప్రతి ఒక్కరూ అవసరంలోనూ ఆపదలోన ఉన్న పేదవారికి, దేవుడి ఆచరణలను పాటించే వారికి సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు ధర్మకర్త సంజీవరెడ్డి, విద్యా వాలంటీరు మాజీ చైర్మన్ సోముగారి ప్రకాశ్ రెడ్డి, మాజీ సర్పంచి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



శివ, అయ్యప్ప స్వాములకు దుప్పట్లు అందిస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

## భూ సమస్యలు లేకుండా చేయడమా.. భూములే లేకుండా చేయడమా..

సంక్రాంతి పర్వదినం సందర్భంగా నారావారిపల్లెలో మాట్లాడిన ముఖ్యమంత్రి ఏడాది కాలంలో భూ సమస్యలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని చెప్పిన మాటలలో నిజం ఎంత. అదే నిజమైతే ఒకవైపు రాష్ట్రంలో భూములు, ఎకరా 99 పైసలు 500 రూపాయలు,ఐ దువేల రూపాయలలకు



కార్పొరేటర్లకు కారు చౌకగా కట్టబెడుతుంటే, ఏడాది కాలంలో భూ సమస్య లేకుండా చేస్తానని చెప్పడం, నిజంగా భూ సమస్యలు లేకుండా చేయడమా, లేక పేద, మధ్యతరగతి చేతులలో భూములు లేకుండా చేయడమా. ఈ మాటలు ముమ్మాటికీ భూములు లేని రాష్ట్రంగా తయారు చేయడాన్నే బలపరుస్తాయి.

గతంలో వైసిపి ప్రభుత్వం రెవెన్యూ,భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం కేంద్రం సహకారంతో రీ- సర్వే కార్యక్రమాన్ని చేపడితే భూములన్నీ జగన్ స్వాధీనం చేసుకుంటాడని దుష్ప్రచారం చేసి, ఎన్నికలలో లబ్ధి పొంది నేడు అదే భూ రీ- సర్వే నిర్వహిస్తూ,పాత పాసు పుస్తకాల స్థానంలో కొత్త పాత పుస్తకాలు ముద్రించి కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని కొల్లగొట్టి పంపిణీ చేస్తున్నారు. అందులో తప్పులు దొర్లి పాసుపుస్తకాలను తప్పుల తడకగా మార్చి పంపిణీ చేస్తూ, తగుదునమ్మా అని భూ సమస్యలే లేని రాష్ట్రంగా చేస్తానని చెప్పడం రాష్ట్ర ప్రజల చెవులలో పువ్వులు పెట్టడమే. ఒక అబద్ధాన్ని పదేపదే చెప్పడం సీరియస్‌గా చెప్పడం చంద్రబాబు నాయుడుకి వెన్నతో పెట్టిన విద్య. బ్లాక్ చైన్ టెక్నాలజీతో రికార్డులకు రాజముద్ర అని ప్రజలకు అర్థం కాని భాషలో పాత సీసాలో కొత్త సారాయి నింపుతున్నారు. మరోవైపు పి4 విధానం తో పేదలను బానిసలుగా మార్చే వ్యవస్థకు శ్రీకారం చుట్టి పి పి పి విధానంతో భూములతో పాటు,ప్రభుత్వ ఆస్తులు,విద్య,వైద్యాన్ని కూడా కారు చౌకగా అమ్మేసి కార్పొరేటర్ల నుండి కమిషన్లు పొందడానికి సిద్ధమైనారు. 18 నెలల కాలంలో ఈ ప్రభుత్వం చేసిన ఘనకార్యం ఏమీ లేదు అప్పులు,అవినీతి, అసహనం,అనే మూడు అ లు తప్ప.

**- కె.వి రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు,**
**"వెలుగుబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక,**
**అనంతపురం.**

# జిల్లా నేతలను కలిసిన గుత్తి టిడిపి నాయకులు

### పార్లమెంట్ అధ్యక్షులు పూల నాగరాజు , ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరికి సన్మానం..

**గుత్తి (తెలుగోడు), జనవరి 17 :**
జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పూల నాగరాజు జిల్లా కార్యదర్శి శ్రీధర్ చౌదరిని గుత్తి టిడిపి నాయకులు వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతపురం జిల్లా పార్లమెంటు ఉపాధ్యక్షులుగా నియమితులైన గుత్తి మండలానికి చెందిన బద్రివల్లి ఆధ్వర్యంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం క్యాంపు కార్యాలయంలో కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గోవర్ధన్ గౌడ్, గుత్తి మండల ప్రధాన కార్యదర్శి పళ్ళ సాంబ శివయ్య యాదవ్, గుత్తి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొత్తపేట సూరి, బెస్త పురుషోత్తం, వడ్డే రాజు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



జిల్లా కార్యదర్శి శ్రీధర్ చౌదరిని కలిసిన టిడిపి నాయకులు




జిల్లా అధ్యక్షులు పూల నాగరాజుని కలిసిన గుత్తి టిడిపి నాయకులు

# ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

### పాళ్యంలో ఉచిత గుండె, కంటి వైద్యశిబిరం.. విశేష స్పందన ..

**పామిడి (తెలుగోడు), జనవరి 17 :**
ఆరోగ్యకరమైన సమాజమే మనందరి లక్ష్యం కావాలని, ప్రతిఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని మాజీ ఎంపీపీ పాళ్యం నారాయణరెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు పేర్కొన్నారు. మండల పరిధిలోని పాళ్యం గ్రామంలో శనివారం మాజీ ఎంపీపీ పాళ్యం నారాయణరెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు ఆధ్వర్యంలో అనంతపురం కిమ్స్ సవేరా హాస్పిటల్ వారు ఉచిత గుండె, కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని, ప్రతిఒక్కరూ ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. కిమ్స్ సవేరా హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ ఆదిశేషులు, డాక్టర్ ఇర్ఫాన్ అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న 120 మందికి వైద్యసేవలు అందించారు. వైద్యసేవలు పొందటానికి పెద్దఎత్తున తరలివచ్చిన ప్రజానీకంతో వైద్యశిబిరం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో కిమ్స్ సవేరా హాస్పిటల్ కో-ఆర్డినేటర్ ఏకనాథ్, టుడిఏకో టెక్నీషియన్ భావన, ఈసీజీ టెక్నీషియన్ చందన, నర్స్ మానస తదితరులు పాల్గొన్నారు.



ఉచిత గుండె కంటి వైద్యశిబిరానికి హాజరైన వైద్యులతో మాజీ ఎంపీపీ పాళ్యం నారాయణరెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు

# బాలికపై పెట్రోల్ పోసి నిప్పంటించిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి

**గుత్తి (తెలుగోడు), జనవరి 17 :**
గుత్తి మండలం బేతపల్లి గ్రామంలో పదేళ్ల బాలికపై పెట్రోల్ పోసి నిప్పంటించిన శ్రీనివాసులును కఠినంగా శిక్షించాలని శనివారం సిపిఎం నాయకులు గుత్తి సీఐ రామారావుకు వినతి పత్రం అందజేశారు. శ్రీనివాసులు తాగిన మైకంలో చిన్నపాటి గొడవను దృష్టిలో ఉంచుకొని బాలికతో పాటు ఆమె తమ్ముడుపై పెట్రోల్ పోసి నిప్పంటించడం అమానుషమన్నారు. నిందితుడు శ్రీనివాసులను కఠినంగా శిక్షించాలని కోరారు. మండలంలో విచ్చలవిడిగా సాగుతున్న గంజాయి, మద్యం నియంత్రణకు ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు రేణుక, రేవతి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.మల్లేష్, కెవిపిఎస్ మండల కార్యదర్శి మల్లికార్జున, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి అశోక్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్ యాదవ్, సిపిఎం కార్యకర్తలు వన్నూరమ్మ, ఊర్మిళ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు బేతపల్లి గ్రామాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వం మద్యపానం నిషేధిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చినా నిషేధాన్ని అమలు చేయకపోవడంతో విచ్చలవిడిగా గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందని ఆరోపించారు. మద్యం తాగి యువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గుత్తి మండలంలో మట్కా, గుట్కా , గంజాయి తదితన మత్తు పదార్థాలు నిషేధించాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్తులో పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.




సీఐ రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు




బేతపల్లిలో బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు



హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మహిళలు

## ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడాలి

### మహిళలకు పోలీసుల అవగాహన

**దువ్వూరు (తెలుగోడు), జనవరి 17 :**
ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి తమ ప్రయాణాలను సురక్షితం చేసుకోవాలని దువ్వూరు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున సూచించారు. జిల్లా ఎస్.పి శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు,37వ జాతీయ భద్రత వారోత్సవాలలో భాగంగా శనివారం దువ్వూరు పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ మనులతో హెల్మెట్ వాడకంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ?ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం తప్పుతుందని, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు . మీపై ఆధారపడి ఉన్న వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది వీర భాస్కర్, వీరయ్య మరియు వాహనదారులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ధర్మస్థలం శ్రీ మంజునాథ స్వామి. భజన చేస్తున్న దృశ్యం

## శ్రీ మంజునాథ స్వామి ఆలయంలో మాసశివరాత్రి ప్రత్యేక పూజలు

**బెళుగుప్ప (తెలుగోడు), జనవరి 17 :**
బెళుగుప్ప లో కొలువైన ధర్మస్థలం శ్రీ మంజునాథ స్వామి ఆలయంలో శనివారం మాస శివరాత్రి పురస్కరించుకొని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయమే స్వామివారికి పంచామృత, రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా సాయంత్రం భక్తులు ఆలయానికి చేరుకొని, స్వామివారి కి పంచామృతాభిషేకం, శ్రీ గౌరీ దేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకుని మహా శివపురాణం చదివి తీర్థప్రసాదాలు పొందారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. రాత్రి భజన బృందాలు భజన చేశాయి.



మాస శివరాత్రి పూజలో పాల్గొన్న భక్తులు

# నిత్య అన్నదాన కృషీవలుడు చల్లా

### పేదల కడుపు నింపే మహానుభావుడు.. నిత్య అన్నదానం పట్ల ప్రొద్దుటూరు పరిసర ప్రాంత ప్రజల హర్షం..

**ప్రొద్దుటూరు (తెలుగోడు), జనవరి 17 :**
నిత్యం అన్నదానాలు చేస్తూ ప్రొద్దుటూరు పరిసర ప్రాంత ప్రజల్లో మంచి పేరు సంపాదించుకొని మంచి వ్యక్తిగా చల్ల రాజగోపాల్ యాదవ్ నిలిచిపోయారు. కొన్ని సంవత్సరాలుగా పేదల కడుపు నింపుతూ అనేక సేవా కార్యక్రమాల్లో ముందుంటూ.. మనసున్న వ్యక్తిగా చల్లా రాజగోపాల్ యాదవ్ నిలిచిపోయారు. ఆయన సేవా కార్యక్రమాల పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రొద్దుటూరు పట్టణ టిడిపి అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో గత నాలుగేళ్లుగా ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే అందులో భాగంగా శనివారం కొర్రపాడు రోడ్డులోని స్థానిక పాత బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని చల్లా రాజగోపాల్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 1000 మంది పాల్గొని రుచికరమైన నాణ్యమైన భోజనాన్ని ఆరగించి తమ సంతృప్తిని వ్యక్తం చేశారు. గత నాలుగేళ్లుగా అలుపెరుగని అన్నదాతగా నిలుస్తూ నిరుపేదల ఆకలిని తీరుస్తున్న చెల్లా రాజన్న అభినందనీయుడని వారు కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచేలా భగవంతుడు ఆయనకు అన్ని రకాలుగా శక్తిని ప్రధాన ప్రసాదించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో.చల్లా రవిశంకర్ యాదవ్. చల్లా మనోహర్ యాదవ్. బంగి శివప్రసాద్. మూరబోయిన శ్రీనివాసులు యాదవ్. చింతల రాఘవేంద్ర యాదవ్.ఏసునాద్ రెడ్డి టైలర్ ప్రసాద్. డ్రైవర్ బాషా. పూల భాష. సునీల్ యాదవ్.రవి హరీష్. తదితరులు పాల్గొన్నారు



అన్నదానం నిర్వహిస్తున్న చల్లా రాజగోపాల్ యాదవ్

# టీడీపీ జిల్లా తొలి కార్యవర్గ సమావేశం

### జిల్లా ఉపాధ్యక్షులు నరసాపురం తూమాటి ప్రసాద్..

**బెళుగుప్ప (తెలుగోడు), జనవరి 17 :**
అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ నూతన కమిటీ సభ్యులు తొలిసారి కార్యవర్గ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. టిడిపి జిల్లా పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు పూల నాగరాజు గారి ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ తొలి కార్యవర్గ సమావేశనికి అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు బెళుగుప్ప మండలం నరసాపురం తూమాటి ప్రసాద్ హాజరయ్యారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఇతర కమిటీ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కమిటీ సభ్యులంతా పరిచయం చేసుకున్న తర్వాత పలు కీలక అంశాల గురించి చర్చించారు. ఇందులో ముందుగా ఈనెల 18న జరగనున్న తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి కార్యక్రమాల గురించి చర్చించారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని ప్రాంతాల్లో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించాలని అధ్యక్షుడు పూల నాగరాజు గారు ఆదేశించారు. పార్టీలో కిందిస్థాయి కార్యకర్త దగ్గర నుంచి ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఏపి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఎలాంటి కార్యక్రమం చేపట్టాలన్నది సభ్యుల అభిప్రాయాలను అధ్యక్షుడు తెలుసుకున్నారు. ఆ తర్వాత అనంతపురము పార్లమెంటు కార్యవర్గ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమం గురించి చర్చించారు. నగరంలో ఈ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహిద్దామని సభ్యులు అంతా ముకుమ్మడిగా అధ్యక్షుడికి తెలిపారు. ప్రతినెలా 1వ తేదీన నిర్వహించే పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పార్లమెంటు పార్టీ కార్యవర్గ సభ్యులు వారి వారి వార్డు/గ్రామం పరిధిలో అర్హులైన వారికి పెన్షన్లను స్వయంగా పాల్గొనాలని పూల నాగరాజు గారు తెలిపారు. ఆ వివరాలను మైటిడిపి యాప్ లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు అమలు చేయవలసిన అంశాలపై చర్చించారు. వీటితోపాటు పలు కీలక అంశాల గురించి సుదీర్ఘంగా తొలి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు పూల నాగరాజు మీడియాతో మాట్లాడుతూ తొలి కార్యవర్గ సమావేశంలో పలు అంశాల గురించి చర్చించామన్నారు. పార్టీని మరింత బలోపేతం చేస్తూ కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యం అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు నరసాపురం తూమాటి ప్రసాద్, కృష్ణకుమార్, వి.జి. లాలెప్ప, వేలూరు రంగయ్య, బండి ఆదినారాయణ, బర్ది వలి, కె.బి. మర్రిస్వామి, కార్యాలయ కార్యదర్శి తాజుద్దీన్, మీడియా కోఆర్డినేటర్ దబ్బర కుమారస్వామి నాయుడు, అధికార ప్రతినిధులు కేశవరెడ్డి, హె.డి. కొల్లపురప్ప, ఖాజా హుస్సేన్, కాయల అనిల్ కుమార్ యాదవ్, ఆనంద్, భూలక్ష్మి, కార్యనిర్వాహక కార్యదర్శులు కంఠాదేవి, చింబిలి ప్రసాద్ నాయుడు, బోయ కవిత, ఆనంద్ గోపాల్, జి.రవి, విజయలక్ష్మి, కార్యదర్శులు షమీర్ సాబ్, వేణుగోపాల్, దేవికాదేవి, చాకలి ప్రకాశ్ పాల్గొన్నారు.



అనంతపురంలో జరిగిన టిడిపి జిల్లా తొలి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షులు తూమాటి ప్రసాద్‌ను సాదరంగా ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు



# రేపు వలసలో ఎన్టీఆర్ వర్ధంతి

*పంచాయతీ కన్వీనర్ బివిఎస్ నాగరాజు..*
*సింగిల్ విండో అధ్యక్షులు గణేష్..*

**అమరాపురం (తెలుగోడు), జనవరి 17 :** మండల పరిధిలో వలస గ్రామంలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ వర్ధంతి ఆదివారం ఉదయం 8. 30 గంటలకు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కన్వీనర్ బి.ఎస్. నాగరాజు, సింగిల్ విండో అధ్యక్షులు గణేష్, మాజీ కన్వీనర్ శివ రుద్రప్ప తెలిపారు. వలస తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# ఎన్టీఆర్ వర్ధంతి విజయవంతం చేయండి

*మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప..*
*సింగిల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప ..*





**గుడిబండ (తెలుగోడు), జనవరి 17 :** గుడిబండలో ఆదివారం జరిగే ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగల్ విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారన్నారు. మండలంలోని ఎన్టీఆర్ అభిమానులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

# రేపు అగళి మండల సర్వసభ్య సమావేశం

*ఎంపిడిఓ గంగాధర్..*



**అగళి (తెలుగోడు), జనవరి 17 :** స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో సోమవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ గంగాధర్ తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా వారి శాఖ పరిధిలో జరిగిన నివేదికలతో హాజరు కావాలని కోరారు.హాజరు కాకపోతే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. అదేవిదంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ లు సర్పంచ్ లు వివిధ హెూదా కలిగిన ప్రభుత్వ ప్రతినిధులు హాజరు కావాలని తెలిపారు.

# రేపటి నుంచి ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 17 :** రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు, పశుపోషకులకు మేలు చేకూర్చే లక్ష్యంతో, జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం సౌజన్యంతో ఈనెల 19 నుండి 31వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించినట్లు పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, వైద్యాధికారి గుర్నాథ్ రెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక పశువైద్యశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. పశు పోషకులకు మరింత చేరువలో పశుసంవర్ధక సేవలు అందిస్తామన్నారు. ఆరోగ్య శిబిరాలతో పాటు అవగాహన సదస్సులు ఉంటాయన్నారు. పశువైద్య చికిత్సలు,ఉచిత నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తామన్నారు. గర్భకోశ వ్యాధులకు ఉచిత చికిత్సలు అందిస్తామన్నారు ఉచిత పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు అందిస్తామన్నారు. పశు యాజమాన్యంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పశు పోషకులుఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# నేడు ఎన్టిఆర్ వర్ధంతి వేడుకలు

*జడ్పీటిసి ఉమేష్.*
*మండల కన్వీనర్ డి. తిప్పేస్వామి..*





**అగళి (తెలుగోడు), జనవరి 17 :** ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలను అగళి పట్టణం బస్టాండ్ ఆవరణలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆదివారం ఉదయం 12 గంటలకు నిర్వహిస్తున్నట్లు జడ్పీటిసి ఉమేష్, మండల కన్వీనర్ డి. తిప్పేస్వామి తెలిపారు. ఎంపీపీ, మాజీ ఎంపీపీలు, వైస్ ఎంపీపీ,అనుబంధ విభాగాల అధ్యక్షులు,మండల నాయకులు,కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్లు, మాజీ సర్పంచులు,ఎంపీటీసీలు, మాజీ ఎంపిటిసిలు,పార్టీ పెద్దలు,గ్రామ పంచాయతీ కమిటీ అధ్యక్షులు,వివిధ అనుబంధ కమిటీ సభ్యులు,టిడిపి నాయకులు కార్యకర్తలు,ఎన్టీఆర్ అభిమానులు ప్రతి ఒక్కరూ తప్పక హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని జడ్పీటిసి ఉమేష్, మండల అధ్యక్షులు డి. తిప్పేస్వామి కోరారు

# ప్రవర్తనలో పరివర్తన రావాలి

## విధిగా పరిశుభ్రత పాటించాలి.. సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ ..

**హిందూపురం (తెలుగోడు), జనవరి 17 :** తప్పులు చేసి కారాగారాలకు వచ్చిన వ్యక్తుల ప్రవర్తనలో పరివర్తన రావాలని, భవిష్యత్తులో తప్పులు చేయకూడదన్న సంకల్పంతో బయటకు వెళ్లాలని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ సూచించారు. శనివారం స్థానిక ఉపకారాగారాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపకారాగారంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం నిందితులతో ఏ ఏ కేసుల్లో ఉన్నారు, ఎప్పటి నుండి కారాగారంలో ఉంటున్నారు, న్యాయవాదులు ఉన్నారా, జామీనుదారులు అందుబాటులో ఉన్నారా అన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్



కారాగారాన్ని పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్

న్యాయమూర్తి మాట్లాడుతూ, తప్పులు చేసి కారాగారాలకు రావడం వల్ల ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబాల గౌరవ, మర్యాదలకు భంగం కలుగుతుందన్నారు. సమాజంలో అలాంటి కుటుంబాలను వేరుగా చూస్తారన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉండి న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని నిందితులు దరఖాస్తు చేసుకుంటే ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని తెలిపారు. అనంతరం ఉప కారాగార వంటగదిని పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సూచించారు. జైలు గదులను పరిశీలించి నిందితులకు ఆహ్లాదం కోసం అలాంటి సౌకర్యాలు ఉన్నాయన్న విషయాలను ఉపకారాగార అధికారి హనుమప్పతో అడిగి తెలుసుకున్నారు. దాతల సహకారంతో అందుకు సంబంధించి అందుకు సంబంధించి చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే నిందితులకు వైద్య చికిత్సల కోసం వైద్యులు ఎప్పుడు వస్తున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, రాజా, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


## సిపిఐ శత వార్షికోత్సవ సభకు

# తరలిన సత్యసాయి జిల్లా నాయకులు

**నల్లమాడ (తెలుగోడు), జనవరి 17 :** తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో నిర్వహిస్తున్న సిపిఐ శత వార్షికోత్సవ సభకు శ్రీ సత్య సాయి జిల్లా సిపిఐ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి కుంచపు చంద్ర మాట్లాడుతూ సిపిఐ 1925 డిసెంబర్ 26న కాన్పూర్లో ప్రారంభమైందన్నారు. కమ్యూనిస్టుల పురిటి గడ్డైన ఖమ్మం పట్టణంలో ఈ నెల 18న (నేడు) శత వసంతాల వేడుకలు కేంద్ర కమిటీ నిర్ణయం మేరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వేడుకలలో పదివేల మంది అరుణ సైన్యం కవాతు చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ వందేళ్ళ ప్రస్థానంలో ఒడిదుడుకులు, జయాపజయాలు, దేశ రాజకీయాల్లో సిపిఐ



సిపిఐ శత వార్షికోత్సవ సభకు తరలివెళ్తున్న శ్రీ సత్యసాయి జిల్లా నాయకులు..



ధర్మవరం రైల్వేస్టేషన్ నుండి ఖమ్మం బయలుదేరుతున్న సిపిఐ నాయకులు కుంచపు చంద్ర

పాత్ర తదితర అంశాలపై వక్తలు ప్రసంగించనున్నారని తెలిపారు. శత వసంత వేడుకల్లో పాల్గొనే అవకాశం తమకు దక్కడం ఆనందంగా ఉందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి ప్రముఖులు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారని ఆయన తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన పలువురు ధర్మవరం రైల్వే స్టేషన్ నుండి ఖమ్మం చేరుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో బుక్కపట్నం మండల సహాయ కార్యదర్శి చాంద్ బాషా తదితర నాయకులు వెళుతున్నట్టు కుంచపు చంద్ర తెలిపారు..

# మృత్యువుతో పోరాడి ఓడిన భాస్కర్

## వారం రోజులుగా చికిత్స పొందుతూ మృతి ..



మృతి చెందిన భాస్కర్ (ఫైల్ ఫోటో )

**రొళ్ల, (తెలుగోడు)జనవరి 17 :** గుడ్డుగురికి గ్రామానికి చెందిన భాస్కర్ అనే యువకుడు మృత్యువుతో పోరాడి ఓడారు. ఈనెల 9న కొబ్బరి బోండాల కోసం చెట్టు ఎక్కి కింద పడ్డ సంఘటనలో భాస్కర్ ఎడమ కాలు తోపాటు మెడ దగ్గర, వెన్నుముకకు తీవ్రంగా దెబ్బతినడంతో గత ఎనిమిది రోజులుగా విక్టోరియా హాస్పిటల్ లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృత్యువాత పడ్డాడు. ఆదివారం సాయంత్రం జడ్పిటిసి అనంతరాజు గుడ్డు గురికి గ్రామంలోని మృతుని ఇంటికి వెళ్లి మృతదేహంపై పూలమాలు లేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.



మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జడ్పిటిసి అనంతరాజు

# బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

## ఆదర్శ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ..

**తనకల్లు (తెలుగోడు), జనవరి 17 :** తనకల్లు మండల పరిధిలోని చీకటి మానిపల్లి గ్రామంలో ఆదర్శ రూరల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ అండ్ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు బ్యాంకు సేవలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ఆదర్శ రూరల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ అండ్ సొసైటీ అధ్యక్షులు లక్ష్మీ దేవి,శివానందలు చీకటిమాని పల్లి గ్రామములోని రైతులు అధిక సంఖ్యలో హాజరై బ్యాంకు సేవల యొక్క ఉపయోగాలు,బీమాలతో పాటు సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమాలు తెలుసుకోవడం జరిగింది. బ్యాంకులలో ఉన్న అన్ని సంక్షేమ పథకాలు అందరూ కూడా



అన్నదానం చేస్తున్న దృశ్యం



అవగాహన కల్పిస్తున్న అధికారులు

సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫైనాన్స్ కంపెనీల వైపు ఎవరు వెళ్లకూడదన్నారు. బ్యాంకులలో అందుబాటులో ఉండి సకాలంలో రుణాలు మంజూరు చేస్తాయి బ్యాంకు ఖాతా కలిగిన ప్రతి ఖాతాదారుడు కచ్చితంగా ఇన్సూరెన్స్ చేసుకోవాలన్నారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే 1930 కి కాల్ చేయాలని రైతులకు అవగాహన సదస్సులో తెలియజేశారు . అనంతరం ఖాతాదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు సేవల పుస్తకాలు నోటుబుక్కులు పెన్నులు ఇచ్చారు. బ్యాంకు సమావేశాలు నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని ఖాతాదారులు సంతోషాన్ని వ్యక్తం చేశారు అనంతరం బ్యాంకుల గురించి మంచి సమాచారం చేరవేసినందుకు స్వచ్ఛంద సంస్థలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



ఎస్సై వలీబాషకు సన్మానం చేస్తున్న అంబేద్కర్ సృతివనం నాయకులు

# ఎస్సై వలీబాషను సన్మానించిన అంబేద్కర్ స్మృతివనం నాయకులు

**అమరాపురం (తెలుగోడు), జనవరి 17 :** అమరాపురం ఎస్.కె వలీబాషను అంబేద్కర్ స్మృతి వనంలో దళిత నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్మృతివనం దళిత నాయకులు నారాయణప్ప, నరసింహమూర్తి, పేలుబండ ప్రసాద్, ఉదుగురు ఆటో తిప్పయ్య, జీ.కే. నరసింహమూర్తి, చెన్నప్ప, ఉప్పార్లపల్లి శివన్న, దేవరాజు, సిద్ధేష్, సురేష్, రాజేష్, మరియు కృష్ణమూర్తి తదితరులు ఘనంగా సన్మానం చేశారు.

# నేడు ఎన్టిఆర్ వర్ధంతి వేడుకలు

*మండల కన్వీనర్ జి కె ఈరన్న ..*
*సింగిల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి..*
*ఏపీఐఐసి డైరెక్టర్ రామక్రిష్ణ..*
*మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రెగౌడ్ ..*









**రొళ్ల (తెలుగోడు), జనవరి 17 :** ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి, కీర్తిశేషులు నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలను రొళ్ల సింగిల్ విండో కార్యాలయం వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ జి కె ఈరన్న, సింగిల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, ఏపీఐఐసి డైరెక్టర్ రామక్రిష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్ తెలిపారు. ఎంపీపీ, మాజీ ఎంపీపీలు, వైస్ ఎంపీపీ,అనుబంధ విభాగాల అధ్యక్షులు,మండల నాయకులు,కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్లు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మాజీ ఎంపిటిసిలు,పార్టీ పెద్దలు,గ్రామ పంచాయతీ కమిటీ అధ్యక్షులు, వివిధ అనుబంధ కమిటీ సభ్యులు,టిడిపి నాయకులు కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.


# నేడు అమరాపురంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు

*మండల కన్వీనర్ దేవగానపల్లి కృష్ణమూర్తి..*
*మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు..*
*సింగిల్ విండో అధ్యక్షుడు ఎన్. గణేష్..*
*బీసీ సెల్ అధ్యక్షుడు మారుతి ప్రసాద్..*









**అమరాపురం (తెలుగోడు), జనవరి 17 :** మండల కేంద్రంలో ఆదివారం స్వర్గీయ నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలను ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉదయం 11 గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సింగిల్ విండో అధ్యక్షులు గణేష్, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు తెలిపారు. వర్ధంతి వేడుకలకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో హాజరుకావాలని అన్నారు. అదేవిధంగా హేమావతి పంచాయతీ గొల్లమారనపల్లి గ్రామంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే వేడుకలకు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండమల తిప్పేస్వామి హాజరవుతున్నట్లు మండల కన్వీనర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో ఉన్న తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అనుబంద నాయకులు డీలర్ సంఘం అధ్యక్షులు ఉపాధ్యక్షులు, ఆయా కట్టు చెరువు సంఘం అధ్యక్షులు ఉపాధ్యక్షులు, డీలర్లు యానిమేటర్లు , ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

# 20 నుంచి ఇమామే ఖాశీం గంధం ఉత్సవాలు

**బత్తలపల్లి (తెలుగోడు), జనవరి 17 :** బత్తలపల్లిలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా వారం రోజులు పాటు ఇమామే ఖాశీం గంధం ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు హాజరత్ ఏ హిమాం ఖాశీం ట్రస్ట్ చైర్మన్, నిర్వహకులు మక్తుం ఖాశింవలి పేర్కొన్నారు. శనివారం బత్తలపల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హిందూ, ముస్లీం సోదర భావంతో వారం రోజులు పాటు మక్తుం కుటుంబ సభ్యులచే వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 20వ తేదీన ఇమామ్ ఖాశీం గ్రాండ్ పర్చం జెండా ఆవిష్కరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 21వ తేదీ హిందు కల్చరల్ కార్యక్రమాలు 22వ తేదీ బురాన్ దావత్, అన్నదాన కార్యక్రమం. 23వ తేదీన పూలహారాలతో రోడ్డు షో నిర్వహణ, 24న ఆటల పోటీలు, 25న రక్తదాన శిబిరం, 26న 200 మంది పక్కీర్లతో కలిసి ఊరేగింపు,27న అన్నదానం, చివరి ఫాతిహా, సలాం కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కావున ఉత్సవాలకు కులాలకు, మతాలకు అతీతంగా అందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మక్తుం ఇస్మాయిల్, మక్తుం ముక్తుంసాట్,ముబారక్, షేక్ బాబావలిలతో పాటు పలువురు పాల్గొన్నారు.



కాశిం స్వామి పీర్ల మకాన్



ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ను సన్మానించిన ప్రింట్ మీడియా అసోసియేషన్ ప్రతినిధులు

## ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు సన్మానం

*గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ..*

**గూడూరు (తెలుగోడు), జనవరి 17 :**
గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్‌ను గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రింట్ మీడియా ప్రతినిధులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని వెల్లడించారు. గూడూరు జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలో ఇంటి స్థలాలు కలిగిన జర్నలిస్టలకు ప్రభుత్వం ద్వారా అందవలసిన అన్ని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు ప్రింట్ మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ జమాలుల్లా, ఉడతా శరత్ యాదవ్, ప్రతినిధులు ఇస్కపల్లి శివ ప్రసాద్ స్వామి,గుంటమడుగు వెంకట సుబ్బరాజు, మీజూరు మల్లిఖార్జున్, ఎస్. కిషోర్ నాయుడు, తిరుమలశెట్టి భవాని శంకర్, ఆత్మకూరు సురేష్, మల్లవరపు కోటి, ధన్యాసి విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న రమేష్

## పేద మహిళలకు చీరలు, బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ

*బేకరీ యజమాని రమేష్..*

**గూడూరు (తెలుగోడు), జనవరి 17 :**
ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం బాలాజీ నగర్‌లోని ప్రగతి సేవా సంస్థ ఆఫీస్ వద్ద ఆర్ముగం 23వ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు "రమేష్ బేకరీ" అధినేత రమేష్ 50 మంది నిరుపేద మహిళలకు చికెన్ బిర్యానీ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు గడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆర్ముగం భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికీ వారి కుమారుడు రమేష్ బేకరీ అధినేత రమేష్ ప్రతి సంవత్సరం ఆయన జ్ఞాపకార్థంగా నిరుపేదలైన వారికి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రమేష్ బేకరీ అధినేత రమేష్ మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ ద్వారా ఈ కార్యక్రమం చేయడం ఆనందంగా ఉందన్నారు. సేవే లక్ష్యం సేవే పరమార్థం అన్న నినాదంతో సమాజంలో పేదవారిని గుర్తించి వారికి ఇతోథికంగా సహాయం చేయడం అందులో తాను భాగస్వామి కావడం ఆనందదాయకంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ అల్లుడు అక్షయ్ ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు వాకాటి రామ్మోహనరావు, టీచర్ మామదూరు రాధయ్య, వాచ్‌షాప్ రాము కుమార్ నాయుడు, నాగరాజు, కెఆర్ ఎం,డివిఎంసి మెంబర్స్ మాకాని వెంకటేశ్వర్లు, నవీన్ జై కుమార్ శ్యామ్ కోట వెంకటేశ్వర్లు, పోతిరెడ్డి పెంచలయ్య, గోల్డ్ షాప్ మల్లి కార్జున్ ,వెంకటరావు, విజయ్ తూపిలి యశ్వంత్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

## లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం

**రామకుప్పం (తెలుగోడు), జనవరి 17:**
రామకుప్పంలో లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవం ఎన్నుకున్నారు. శనివారం స్థానిక సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద లయన్స్ క్లబ్ కార్యవర్గ సభ్యులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులుగా సత్యనారాయణ శెట్టి, కార్యదర్శి ఉమామహేశ్వరరాజు, కోశాధికారిగా రతన్ లాల్, సేవా కమిటీ చైర్మన్ , పీవి సీతాపతి, సభ్యులు ఇంద్ర ప్రకాష్ రెడ్డి, ఆర్ ఎన్ విజయకుమార్, ఎస్ కే రవి, మన్సూర్, హరీష్, కమలనాథ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా రవికుమార్, విశ్వనాథ్, అడ్మిన్ కమిటీ చైర్మన్ వేణుగోపాల రాజును ఎన్నుకున్నారు. మండలంలోని గ్రామాల్లో పేద ప్రజలకు, విద్యార్థులకు నిస్వార్థ సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేస్తామన్నారు.

## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి

*చిత్తూరు జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు ..*

**రామకుప్పం (తెలుగోడు), జనవరి 17:**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని చిత్తూరు జిల్లా బిజెపి కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం రామకుప్పంలో బిజెపి నేతలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మండలంలో జనతా వారిది కార్యక్రమం చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో పర్యటించి పేద ప్రజల సమస్యలు పరిష్కారం కొరకు అధికారులతో సమీక్షించాలన్నారు. బిజెపి పార్టీ బలోపేతానికి దృష్టి సారించాలని కోరారు. మండలంలో బిజెపి పంచాయతీ అధ్యక్ష ,కార్యదర్శుల కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు రాణి జనార్దన్ రెడ్డి, రాష్ట్ర బిజెపి కౌన్సిల్ సభ్యులు ఆంజనేయప్ప, నేతలు బి నాగరాజు, సుకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అట్లూరి శ్రీనివాసులు

## గద్వాల సోమన్న "మట్టి పరిమళం" పుస్తకావిష్కరణ

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 17 :**
నందవరం మండల పరిధిలోని నాగులదిన్నె గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల సోమన్న విరచిత "మట్టి పరిమళం" పుస్తకావిష్కరణ కార్యక్రమం తిరుపతిలో జరిగింది. తిరుపతి పిల్లల ప్రపంచం, సైన్స్ సెంటర్‌లో "సాహితీ సంక్రాంతి – బాలానందం, బాలసాహితోత్సవం" సందర్భంగా డా. కిట్టన్న, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత గంగిశెట్టి శివకుమార్, యువశ్రీ మురళీ, విద్వాన్ గోవిందయ్య, కళాపోషకులు ఏఎల్. కృష్ణారెడ్డి, పిళ్ళై చంద్రశేఖర్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సినీ గేయ రచయిత పెంచల్ దాస్, గరిమెళ్ల అశోక్, ఆర్. సి.కృష్ణస్వామిరాజు, పుల్లా రామాంజనేయులు, చక్రపాణి పాల్గొన్నారు. అనంతరం బహు గ్రంథకర్త, వక్త, బాలసాహిత్యవేత్త గద్వాల సోమన్నను ఘనంగా సత్కరించారు.



మాట్లాడుతున్న కవి గద్వాల సోమన్న





గద్వాల సోమన్న రచించిన 'మట్టి పరిమళం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం. కవి గద్వాల సోమన్నను సన్మానిస్తున్న ప్రముఖులు

## పాఠశాల సమీపంలో ఉన్న బావికి కంచె ఏర్పాటు

### గ్రామ పంచాయతీ సిబ్బందికి కృతజ్ఞతలు..

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 17 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని మేకడోణ గ్రామంలో ప్రాథమిక పాఠశాల (ఉర్దూ) సమీపంలో ఉన్న బావికి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం కంచె ఏర్పాటు చేశారు. దీంతో గ్రామ పంచాయతీ కార్యదర్శి మంజునాథ్, వైసీపీ నేత నారాయణ స్వామికి ఏఐవైఎఫ్ నాయకులు హుసేన్ బాషా, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల (ఉర్దూ) దగ్గర్లో బావి ఉండడంతో విద్యార్థులకు ప్రమాదంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గ్రామ పంచాయతీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మంజునాథ్ పాఠశాల విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా గ్రామ పంచాయతీ నిధులతో బావికి పూర్తిగా కంచె ఏర్పాటు చేయించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. పాఠశాలకు వెళ్లే తమ పిల్లలు బావి ప్రమాదకరంగా ఉందని ఆందోళన చెందేవారు. పాఠశాల సమీపంలో ఉన్న బావికి పూర్తిగా కంచె వేయడంతో పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



పాఠశాల సమీపంలో ఉన్న బావికి కంచె వేసిన దృశ్యం



కంచె పనులను పర్యవేక్షించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి మంజునాథ్





యాగశాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చక స్వాములు

## ఘనంగా పూర్ణాహుతి కార్యక్రమం

**శ్రీశైలం (తెలుగోడు), జనవరి 17 :**
మకరసంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని పంచాహ్నికదీక్షతో ఏడురోజులపాటు నిర్వహించిన సంక్రాంతి బ్రహ్మోత్సవాలలో ఆరవరోజైన శనివారం నాడు శ్రీ స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. శ్రీస్వామివారి యాగశాలలో శ్రీచండీశ్వరస్వామివారికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, మహదాశీర్వచనం జరిపించారు. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు, పలు సుగంధద్రవ్యాలు, నూతన వస్త్రాలు హోమగుండంలో సమర్పించి యాగపూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించారు. వసంతోత్సవంలో ఆలయ అర్చకులు, వేదపండితులు వసంతాన్ని (పసుపు, సున్నం కలిపిన మంత్ర పూరిత జలం) సమంత్రకంగా భక్తులపై ప్రోక్షించారు. అనంతరం అవబృథస్నానంలో చండీశ్వరస్వామికి ఆలయ పుష్కరిణి వద్ద ఆగమ శాస్త్రోక్తంగా స్నపన కార్యక్రమం నిర్వహించారు. చివరగా త్రిశూలస్నానం నిర్వహించారు. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు దేవకి వెంకటేశ్వర్లు, ప్రత్యేక ఆహ్వానితులు ఎ. శ్రీనివాసులు, ప్రధానార్చకులు స్థానాచార్యులు (అధ్యాపక) వేదపండితులు, అర్చకస్వాములు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**సదస్యం నాగవల్లి..**
సంక్రాంతి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం స్వామి అమ్మవార్ల నిత్యకల్యాణ మండపంలో సదస్యం, నాగవల్లి కార్యక్రమాలు నిర్వహించారు. సదస్యం కార్యక్రమంలో వేదపండితులు వేదస్వస్తి పఠించారు. నాగవల్లి కార్యక్రమంలో సంక్రాంతి పర్వదినాన కల్యాణోత్సవం జరిపించారు. అమ్మవారికి ఆగమశాస్త్రం సంప్రదాయం మేరకు మెట్టెలు, నల్లపూసలు సమర్పించారు.



పూజలు నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

**ధ్వజావరోహణం..**
బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం సాయంకాలం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల మొదటిరోజు ప్రారంభ సూచకంగా ఆలయ ధ్వజస్తంభంపై ఆవిష్కరించిన ధ్వజపటాన్ని అవరోహింపజేశారు.

**నేటితో ముగియనున్న సంక్రాంతి బ్రహ్మోత్సవాలు..**
సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగియనున్నాయి. సాయంకాలం శ్రీ స్వామిఅమ్మవార్లకు అశ్వవాహనసేవ , ఆలయ ఉత్సవం జరిపిస్తారు. ఆలయ ఉత్సవం అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్లకు పుష్పోత్సవం, ఏకాంతసేవ, శయనోత్సవం నిర్వహిస్తారు.





చక్రస్నానం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు



మాట్లాడుతున్న ఎస్ఐ నిరంజన్ రెడ్డి

## ఇద్దరు నిందితులపై గంజాయి కేసు నమోదు

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 17 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో గంజాయి సాగు చేసి విక్రయిస్తున్న కురువ మల్లికార్జున, కొనుగోలు చేసేందుకు వచ్చిన కురువ ఓంకారిలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. గ్రామంలో కురువ మల్లికార్జునకు చెందిన కొట్టం వద్ద గంజాయి తూకం వేస్తుండగా కోసిగి సీఐ బిఏ మంజునాథ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పట్టుకొన్నట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి సుమారు 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

## తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్

*నేడు ఎన్టీఆర్ వర్ధంతి..*
*టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున..*

**పెద్దకడబూరు (తెలుగోడు), జనవరి 17 :**
తెలుగు వారి ఆత్మగౌరవానికి ప్రతీక ఎన్టీఆర్ అని టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున శనివారం స్పష్టం చేశారు. మంత్రాలయం టీడీపీ ఇన్ చార్జ్ రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్రుల ఆరాధ్య దైవం, సంక్షేమ పథకాల ప్రదాత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలు నేడు



పెద్దకడబూరులోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని వివిధ గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని పిలుపునిచ్చారు. వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించడం జరుగుతుందని, టీడీపీ శ్రేణులు వందలాదిగా తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

## ఘనంగా షటిల్ టోర్నమెంట్

**ఇందుకూరుపేట (తెలుగోడు), జనవరి 17 :**
మండల పరిధిలోని కొమరిక గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సురేష్- కృష్ణ జట్టు విజయం సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. రన్నర్స్‌గా జైసూర్య-వెంకట సూర్య జట్టు నిలిచింది. ఈ సందర్భంగా విజేతలకు వైఎస్సార్‌సీపీ నాయకులు గుడూరు శివకుమార్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌ను మురళీకృష్ణ , కొండవేటి సురేంద్రలు విజయవంతంగా నిర్వహించారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

## బంగారు గొలుసు లాక్కెళ్లిన దొంగలు

**ముద్దనూరు, తెలుగోడు జనవరి 17**
మేజర్ పంచాయతీలోని సాయి నగర్ కాలనీకి చెందిన రేపల్లె బసవమ్మ(48) మెడలోని బంగారు గొలుసును బైక్‌పై వచ్చి ఇద్దరు వ్యక్తులు లాక్కెళ్లారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉప్పులూరు, వేర్పుచర్ల, లో సహోదరుడి పొలంలో గడ్డి తదితర పొలం పనులు ముగించుకుని వదినతో కలిసి వస్తూండగా ఇద్దరు వ్యక్తులు మోటర్ బైక్‌పై వచ్చి గొలుసు లాక్కెళ్లారని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

## సీఎం సహాయానిధి చెక్కులు పంపిణీ

ఎమ్మెల్యే డా. పాశం సునీల్ కుమార్

**గూడూరు (తెలుగోడు), జనవరి 17 :**
లబ్ధిదారులకు 19వ విడత 51 ముఖ్యమంత్రి సహాయానిధి చెక్కులను క్యాంప్ కార్యాలయంలో డాక్టర్ పాశం సునీల్ కుమార్ శనివారం పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 39,07,708 రూపాయల 51 చెక్కులను పంపిణీ చేశారు.

# హిట్టు కొట్టి చూపించా..శర్వానంద్





'నారీ నారీ నడుమ మురారి'తో చెప్పి మరీ హిట్టు కొట్టాన'ని కథానాయకుడు శర్వానంద్ అన్నారు. ఈ కథ విన్న తొలిరోజు నుంచే ఇది తనకెంతో నమ్మకాన్ని కలిగించిందని.. ఈ సినిమా ఎప్పుడు విడుదల చేసినా తప్పకుండా బ్లాక్‌బస్టర్ అవుతుందని ముందే ఊహించానని.. ఇప్పుడా నమ్మకం నిజమైనందుకు ఆనందంగా ఉందని తెలిపారు. శర్వా హీరోగా నటించిన ఈ సినిమాని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య కథానాయికలు. నరేశ్, సంపత్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. నిర్మాత దిల్‌రాజు, దర్శకుడు శ్రీను వైట్ల అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ.. 'ఇది నాకు చాలా ఎమోషనల్ మూమెంట్. హిట్ కొడతానని చెప్పి మరీ కొట్టాను. సంక్రాంతికి రావాలన్న నా కల నెరవేర్చినందుకు నిర్మాత అనిల్‌కు ధన్యవాదాలు. నేను చాలా రోజులుగా హిట్ కోసం ఎదురు చూస్తున్నా. నాకు ఆ హిట్ ఇచ్చిన దర్శకుడు రామ్ అబ్బరాజుకు కృతజ్ఞతలు. ఈ చిత్రానికి మరో హీరో నరేశ్. మా నాన్న పాత్ర పోషించారు. సినిమా చూసిన వాళ్లంతా 'చాలా రోజుల తర్వాత ఇంతలా నవ్వుకున్నామ'ని చెప్తుంటే ఆనందంగా అనిపించింది. నేనెప్పుడు సంక్రాంతికి వచ్చినా అన్ని సినిమాలు ఆడతాయి. అందుకే ఇకపై ప్రతి సంక్రాంతికి నాకోసం ఒక స్లాట్ పక్కన పెట్టండి ..వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా. శ్రీను వైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీస్ నిర్మించనున్న నా తదుపరి సినిమా పండక్కే వస్తుందని అన్నారు. పండగ చివర్లో రావడం వల్ల ఎక్కువ థియేటర్లు ఇవ్వలేకపోయాం. కానీ, వచ్చే వారం నుంచి స్క్రీన్స్ పెరగబోతున్నాయి. ఇది చాలా పెద్ద హిట్ కొట్టబోతుందని అన్నారు నిర్మాత దిల్‌రాజు.

# చేతులు మారిన మద్రాస్ ఎన్టీఆర్ ఇల్లు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, నటుడు, దివంగత ఎన్.టి.రామారావు నివసించిన చెన్నైలోని ఇల్లు నందమూరి సోదరుల నుంచి చదలవాడ సోఓదరుల చేతుల్లోకి వెళ్లింది. దానిని అమ్మేయడంతో ఇప్పుడు వారు పూర్వపుశోభ తీసుకొచ్చే దిశగా పునరుద్ధరణ పనులు చేపట్టారు. జరుగుతున్నాయి. ఇవి పూర్తయిన తర్వాత ప్రజలు సందర్శించడానికి అనుమతించనున్నారు. నేడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన ఇంటికి సంబంధించిన వివరాలు వెల్లడయ్యాయి. చెన్నై త్యాగరాయనగర్‌లోని బజుల్లా రోడ్డులో సుమారు వెయ్యి గజాల విస్తీర్ణంలో ఉన్న ఇంటిని 1953లో ఎన్టీఆర్ తన సతీమణి బసవతారకం పేరిట కొనుగోలు చేశారు. ఈ ఇల్లు ఆయనకు ఎంతో కలిసి వచ్చిందని చెబుతారు. కొన్నేళ్లకు కళా విహీనంగా మారిన ఆ ఇంటికి పూర్వపు వైభవం తీసుకొచ్చేందుకు పలువురు అభిమానులు ప్రయత్నించినా సుమారు 30 మంది వారసులు ఉండటంతో ఆ ప్రయత్నాలు కొలిక్కిరాలేదు. ప్రస్తుతం ఆ ఇంటిని తాము కొనుగోలు చేసినట్లు నందమూరి కుటుంబానికి సన్నిహితులు, బంధువులైన చదలవాడ సోదరులు తిరుపతిరావు, శ్రీనివాసరావు వెల్లడించారు. ఆ ఇంటికి మరమ్మతు పనులు ప్రారంభించారు. నిర్మాణశైలిని మార్చకుండా తీర్చిదిద్దుతున్నారు. ఇంటి ముందు ఉన్న ఫ్లైవర్ పైనుంచి వెళ్లేవారు చూసినా కనిపించేలా ఇంటి ప్రధాన ద్వారం పైన 'శ్రీకృష్ణపాండవీయం' చిత్రంలో సుయోధనుడి పాత్రలో కనిపించిన ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రజలు ఎన్టీఆర్ ఇంటిని చూసి ఆనందించేలా ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇటీవల చదలవాడ శ్రీనివాసరావు వెల్లడించారు. ఎన్టీఆర్ నివాసం అప్పట్లో అభిమానులతో కళకళలాడేది. పలువురు అభిమానులు మద్రాస్‌కు చేరుకుని తమ అభిమాన నటుడు ఎన్టీఆర్‌ను కనులారా చూసి ఆనందించేవారు. తెలుగు సినీ పరిశ్రమ హైదరాబాద్‌కు తరలడం, ఎన్టీఆర్ కుటుంబం చెన్నైను వీడటం వంటి కారణాలతో ఆ ఇంటిని పట్టించుకునేవారు లేకపోయారు.



# మన శంకరవరప్రసాద్‌గారు రూ 226 కోట్లు వసూలు




టాలీవుడ్‌లో సంక్రాంతి సీజన్‌ను పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకున్న సినిమాగా 'మన శంకర వరప్రసాద్ గారు' నిలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, విజయవంతమైన దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ పండగకు విడుదలై థియేటర్లలో జోరుగా సాగుతోంది. ప్రమోషన్ల దశ నుంచే భారీ అంచనాలు ఏర్పడగా, విడుదల తర్వాత ఆ అంచనాలను వసూళ్ల రూపంలో నిజం చేస్తోంది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో థియేటర్లకు తరలిరావడంతో అన్ని ప్రాంతాల్లోనూ షోలు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. వీకెండ్ కావడంతో కలెక్షన్లు మరింత ఊపందుకున్నాయి. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లోనూ ఈ సినిమానే ముందంజలో ఉంది. బుక్‌మైషో వేదికగా ఇప్పటివరకు దాదాపు 2.5 మిలియన్ల టికెట్లు అమ్ముడవడం ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనం.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమా తొలి రోజే భారీ ఓపెనింగ్‌ను నమోదు చేసింది. ఆ తర్వాత రోజురోజుకీ వసూళ్లు పెరుగుతూ మూడో రోజుకు రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను, నాలుగో రోజుకు రూ.200 కోట్ల క్లబ్‌ను దాటింది. తాజాగా ఐదు రోజుల కలెక్షన్లను మేకర్స్ అధికారికంగా ప్రకటించగా, ప్రపంచవ్యాప్తంగా రూ.226 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు వెల్లడించారు. ఇది ఒక ప్రాంతీయ సినిమాకు ఆల్‌టైమ్ రికార్డు అని పేర్కొంటూ స్పెషల్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో విడుదల చేశారు.నిర్మాతల ప్రకటనలో 'ప్రతి మార్కెట్‌లో 'మన శంకర వరప్రసాద్ గారు' డామినేషన్ కొనసాగుతోంది. మెగా సంక్రాంతి బ్లాక్‌బస్టర్‌గా ఈ చిత్రం ఐదు రోజుల్లోనే రూ.226 కోట్లకు పైగా గ్రాస్ సాధించింది. ఇది రీజినల్ సినిమా చరిత్రలో అరుదైన ఘట్టం' అని పేర్కొన్నారు. వీకెండ్ మొత్తం సినిమా ట్రెండ్ కొనసాగుతుందని కూడా వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఈ చిత్రంలో చిరంజీవికి జోడీగా నయనతార నటించగా, విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో కనిపించారు. వీటీవీ గణెళిష్, యూట్యూబర్ నందన తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు.


# ప్రభాస్ స్పిరిట్‌కు డేట్ ఫిక్స్




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్,సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరిగిపోతున్నాయి, గత కొన్ని రోజులుగా ఈ చిత్రం 2027 సంక్రాంతి బరిలో నిలుస్తుందని సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయితే, తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ విడుదల తేదీపై చిత్ర యూనిట్ క్లారిటీనిస్తూ ఒక కీలక ప్రకటన చేసింది, అందరూ ఊహించినట్లుగా సంక్రాంతికి కాకుండా, ఈ చిత్రం 2027, మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. సంక్రాంతి రేసు నుండి తప్పుకున్నప్పటికీ, మార్చి 5న విడుదల కావడం వల్ల ఈ సినిమాకు లాంగ్ సమ్మర్ సీజన్ ప్లస్ పాయింట్‌గా మారనుంది, పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ప్రభాస్ కనిపించనున్న ఈ సినిమా కోసం సందీప్ రెడ్డి వంగా ఒక విభిన్నమైన, రా యాక్షన్ డ్రామాను సిద్ధం చేస్తున్నారు. ప్రభాస్ తన కెరీర్లో మొదటిసారిగా ఒక సీరియస్ ఐపీఎస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నారు. ప్రభాస్ సరసన తృప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ కీలక పాత్రలో మెరవనున్నారు. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి బ్లాక్ బస్టర్ల తర్వాత వంగా తీస్తున్న సినిమా కావడంతో వరల్డ్ వైడ్ మార్కెట్ ఈ చిత్రంపై కన్నేసింది, అధికారిక విడుదల తేదీ వెల్లడి కావడంతో ప్రభాస్ అభిమానులు ఖుషీ అవుతున్నారు. ఇప్పటికే విడుదలైన 'సౌండ్ స్టోరీ' టీజర్ సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతుందో హింట్ ఇచ్చింది, ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది.

# మరో విభిన్నమైన కథతో ధనుష్.. కర మూవీ

రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు పరిమితం కాకుండా, ఎప్పటికప్పుడు కొత్త కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్న తమిళ స్టార్ ధనుష్ మరోసారి వార్తల్లో నిలిచారు. కథల ఎంపికలో తనకంటూ ప్రత్యేకమైన స్టైల్‌ను కొనసాగిస్తున్న ధనుష్, గత ఏడాది మూడు భాషల్లో సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించాడు.గత ఏడాది తెలుగులో 'కుబేరా', తమిళంలో 'ఇడ్లీ కడాయ్', హిందీలో 'తేరే ఇష్క్ మేన్' చిత్రాల్లో నటించిన ధనుష్, ఈ మూడింటిలో 'ఇడ్లీ కడాయ్' మినహా మిగిలిన రెండు సినిమాలతో బ్లాక్‌బస్టర్ విజయాలను అందుకున్నాడు. ఈ విజయాలతో మరోసారి తన మార్కెట్‌ను మరింత పెంచుకున్న ఈ హీరో, ఇప్పుడు మరో సరికొత్త పాత్రతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఆ సినిమానే 'కర'. 'పోర్ తోజిల్' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని తాజాగా సంక్రాంతి కానుకగా మేకర్స్ టైటిల్‌తో పాటు టీజర్‌ను విడుదల చేశారు. విడుదలైన టీజర్ ఒక్కసారిగా సినిమాపై అంచనాలను భారీగా పెంచింది.రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ధనుష్ ఇప్పటివరకు చేయని కొత్త రోల్‌లో కనిపించనున్నాడని టీజర్ చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది. మట్టి వాసనతో కూడిన కథనం, పవర్‌ఫుల్ ప్రెజెన్స్‌తో ధనుష్ కనిపించిన తీరు అభిమానులను ఆకట్టుకుంటోంది. కథ, పాత్ర పరంగా ఈ సినిమా పూర్తిగా భిన్నంగా ఉండబోతోందనే సంకేతాలు టీజర్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.




Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.